TELANGANA SHASANA SABHA
TELTEL/2016/68867

# తెలంగాణ శాసనసభ

తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 111 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | శుక్రవారం 27 సెప్టెంబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-

## భద్రతా మండలిలో భారత్ ఉండాల్సిందే - ఫ్రాన్స్



ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు అంతర్జాతీయంగా మరింత మద్దతు లభిస్తోంది. ఈ క్రమంలో ఫ్రాన్స్ కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది.మారుతున్న కాలానికనుగుణంగా భద్రతా మండలి మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని..

# కాళేశ్వరం ప్రాజెక్టును ఉదాహరణగా చూపించి...
# అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక



- అధికారులు జీవితంలో ఏ తప్పు చేయకూడదో కాళేశ్వరం ఉదాహరణ అన్న సీఎం
- నాణ్యత లోపిస్తే ప్రాజెక్టులు దీర్ఘకాలం నిలబడవని వ్యాఖ్య
- నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు ఇన్నాళ్లు నిలబడకపోయేవన్న సీఎం
- కాళేశ్వరం ప్రాజెక్టు అప్పుడే కూలిపోయిందన్న ముఖ్యమంత్రి

**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. అధికారులు జీవితంలో ఎలాంటి తప్పు చేయకూడదో దానికి మంచి ఉదాహరణ కాళేశ్వరం ప్రాజెక్టు అని పేర్కొన్నారు. తెలంగాణ నీటి పారుదల శాఖలో కొత్తగా ఎంపికైన 700 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎర్రమంజిల్‌లోని జలసౌధలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.నాణ్యత లోపిస్తే ప్రాజెక్టులు దీర్ఘకాలం నిలబడవన్నారు. నాణ్యత లేకుంటే నాగార్జున సాగర్, శ్రీశైలం వంటి ప్రాజెక్టులు ఇన్నేళ్లు నిలబడేవి కావన్నారు. పైఅధికారులు చెప్పారని నాణ్యత, నిబద్ధత విషయంలో రాజీపడవద్దని సూచించారు. దశాబ్దాల క్రితం నిర్మించిన నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టు లక్షల ఎకరాలకు నీళ్ళు అందిస్తున్నాయన్నారు. కానీ ఐదేళ్ల క్రితం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అప్పుడే కూలిపోయిందన్నారు.నిర్మాణం పూర్తికాకముందే కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టును ప్రపంచ అద్భుతంగా గత పాలకులు అభివర్ణించారని మండిపడ్డారు. కాళేశ్వరం విషయంలో ఎవరిని బాధ్యులను చేయాలి? క్షేత్రస్థాయిలో ఇంజినీర్లు సమర్థవంతంగా పని చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదన్నారు. నిర్మాణ సామగ్రి నాణ్యత కూడినది కాదని ఇంజినీర్లు వెనక్కి పంపిస్తే కూలిపోయే పరిస్థితి వచ్చేది కాదన్నారు.

## కాంగ్రెస్ తుపానులో భాజపా కొట్టుకుపోవడం ఖాయం: రాహుల్



ఛండీగఢ్: దేశంలో నిరుద్యోగ సమస్య తాండవిస్తోందని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. ప్రధాని మోదీ .. పక్కా ప్రణాళిక ప్రకారం ఉపాధి రంగాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు.

వివరాలు »»2లో

# ఫార్మా సిటీ వ్యవహారంలో
# కేటీఆర్ సంచలన ఆరోపణలు



- ఫార్మా సిటీని రద్దు చేయడం లేదని ప్రభుత్వం హైకోర్టుకు చెప్పిందన్న కేటీఆర్
- వివిధ సందర్భాలలో రద్దు చేసినట్టు చెబుతున్నారని ఆగ్రహం
- ఫార్మా సిటీ భూములను ఇతర అవసరాలకు మళ్లించవద్దన్న కేటీఆర్
- ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఫోర్త్ సిటీకు భూసేకరణ చేశారా? అని నిలదీత

**శాసనసభ / హైదరాబాద్ :** హైదరాబాద్ ఫార్మా సిటీ రద్దు వెనుక వేల కోట్ల కుంభకోణం జరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఇది పక్కా రియల్ ఎస్టేట్ దందా అన్నారు. సిరిసిల్లలోని బీఆర్ఎస్ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... ఫార్మా సిటీని రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ చెప్పిందని గుర్తు చేశారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నేతలు వివిధ వేదికలపై రద్దు గురించి చెప్పారన్నారు.

## రైతులకు శుభవార్త..
### అక్టోబర్ 5న రైతుల ఖాతాల్లోకి డబ్బులు..!



**ఢిల్లీ / శాసనసభ :** కేంద్ర ప్రభుత్వం రైతులకు శుభవార్త చెప్పింది. త్వరలో పీఎం కిసాన్ పథకం డబ్బులు అన్నదాతల ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలిచేందుకు 2019 ఫిబ్రవరిలో పీఎం కిసాన్ యోజన పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింద నాలుగు నెలలకు రూ.2 వేల చొప్పున సంవత్సరానికి రూ.6 వేలను అన్నదాతల ఖాతాల్లో జమ చేస్తోంది. ఇప్పటి వరకు 17 విడతలుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ. 34 వేలు జమ చేశారు. 17వ విడతను జులై 18, 2024న విడుదల చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రూ.9.26 వేల కోట్లను లబ్దిదారుల ఖాతాల్లో జమ చేశారు.

## హేమంత్ సర్కార్ ఇంటికే.. భూమ్మీద ఏ శక్తీ ఆపలేదు: రాజ్‌నాథ్ సింగ్



రాంచీ: కొద్ది నెలల్లో జరగబోయే ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో జేఎంఎం సారథ్యంలోని కూటమి ప్రభుత్వం నిష్క్రమించడం ఖాయమని.. భూమిపై ఉన్న ఏ శక్తీ దాన్ని ఆపలేదని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

వివరాలు »»2లో

## 24 కోట్ల సీఎంఆర్ ధాన్యం మాయం..


మూడు రైస్ మిల్లుల **యజమానులపై** క్రిమినల్ కేసులు



## ర్యాలీల్లో డీజే, టపాసుల వాడకంపై రౌండ్ టేబుల్ సమావేశం



## భారీ లాభాల్లో ముగిసిన మార్కెట్ సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం భారీ లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మిశ్రమ సంకేతాల నడుమ ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు ఆ తర్వాత పుంజుకున్నాయి.ఆటో, మెటల్స్ స్టాక్స్ మద్దతుతో సూచీలు రాణించాయి.

వివరాలు »»2లో

## ప్రజాభవన్‌లో ప్రవాసీ ప్రజావాణి
## ప్రత్యేక కౌంటర్ ప్రారంభం

- ప్రవాసీ ప్రజావాణి ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించనున్న మంత్రి పొన్నం
- గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ కౌంటర్ ఏర్పాటు
- ప్రతి బుధ, శుక్రవారాల్లో తెరిచి ఉండనున్న కౌంటర్



**శాసనసభ / హైదరాబాద్ :** ప్రజాభవన్‌లో ప్రవాసీ ప్రజావాణి ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించనున్నారు. ప్రవాసీ ప్రజావాణి ప్రత్యేక కౌంటర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభిస్తారు. గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల కోసం ఈ ప్రత్యేక ప్రజావాణి కౌంటర్‌ను ప్రారంభిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి పాల్గొననున్నారు. ప్రధానంగా గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి బుధ, శక్రవారాల్లో ఈ ప్రత్యేక కౌంటర్ తెరిచి ఉంటుంది.

## బీజేపీ నేత చెప్పిన సమాధానం
## విని ఆశ్చర్యపోయాను: అరవింద్ కేజ్రీవాల్

- నా అరెస్ట్ వల్ల మీకేం లాభం కలిగిందని ఓ బీజేపీ నేతను ప్రశ్నించానన్న కేజ్రీవాల్
- ఢిల్లీలో పాలన పట్టాలు తప్పిందని తనకు సమాధానం చెప్పాడన్న మాజీ సీఎం
- ప్రజలెవరూ ఆందోళన చెందవద్దు... పనులన్నింటిని మొదలు పెడతానని హామీ




వివరాలు »»2లో

( మొదటి పేజీ తరువాయి )

## భద్రతా మండలిలో భారత్ ఉండాల్సిందే - ఫ్రాన్స్



భారత్ వంటి దేశాలకు కచ్చితంగా స్థానం కల్పించాలని సూచించింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్షోభాలను పరిష్కరించడం ఐరాసకు తీవ్ర సవాలుగా మారిందని వార్తలు వినిపిస్తున్న వేళ ఫ్రాన్స్ ఈ విధంగా వ్యాఖ్యానించింది."భద్రతా మండలి విస్తరణకు ఫ్రాన్స్ అనుకూలం. భారత్, జర్మనీ, జపాన్, బ్రెజిల్‌లకూ శాశ్వత సభ్యత్వం ఉండాలి. ఆఫ్రికా నుంచి రెండు దేశాలకు ప్రాతినిధ్యం కల్పించాలి" అని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ పేర్కొన్నారు. ఐరాస సర్వసభ్య సమావేశాల్లో ప్రసంగించిన ఆయన.. యూఎన్ఎస్సీ సమర్థతను పునరుద్ధరించడానికి కేవలం ఈ మార్పులు సరిపోవన్నారు. యూఎన్ఎస్సీ అవలంబిస్తున్న విధానాల్లో మార్పులు రావాల్సి ఉందని ఫ్రాన్ అధ్యక్షుడు అభిప్రాయపడ్డారు. సామూహిక నేరాల కేసుల్లో వీటో అధికారాలకు పరిమితులు, శాంతిని నెలకొల్పేందుకు అవసరమైన వ్యూహాలపై దృష్టి పెట్టడం వంటి మార్పులు రావాలన్నారు. క్షేత్రస్థాయిలో కార్యాచరణ చేపట్టేందుకు సమయం ఆసన్నమైందని మెక్రాన్ పిలుపునిచ్చారు. ప్రస్తుతం అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కలిగి ఉన్న విషయం తెలిసిందే.

## కాంగ్రెస్ తుపానులో భాజపా కొట్టుకుపోవడం ఖాయం: రాహుల్



దేశంలో ఉద్యోగాల కొరతకు మోదీ కారణం కాదా? అని ప్రశ్నించారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన చండీగఢ్‌లో పర్యటించారు. ప్రధాని మోదీ ప్రజలను విభజించి పాలిస్తున్నారనీ, ఒకరిని చూసి మరొకరు అసహ్యించుకునేలా తయారు చేశారని మండిపడ్డారు.హరియాణాలో భాజపా కుప్పకూలడం ఖాయమని, తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. " కాంగ్రెస్ తుపాను రాబోతోంది. అందులో భాజపా కొట్టుకుపోవడం పక్కా. రాష్ట్రాన్ని ఆ పార్టీ సర్వనాశనం చేసింది. అందుకు ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారు. ఇటీవల అమెరికా వెళ్లినప్పుడు అక్కడ ఉంటున్న హరియాణా వాసులను కలిశాను. డల్లాస్, టెక్సాస్‌లో ఒక్కో గదిలో 15 నుంచి 20 మంది ఉన్నారు.ఇక్కడికెలా వచ్చారని అడిగితే.. హరియాణాలో కనీసం ఉపాధి దొరకడం లేదు. ఎలాగైన బతుకుసాగించాలన్న ఉద్దేశంతో ప్రమాదకర స్థితిలో కజకిస్థాన్, తుర్కియే, దక్షిణ అమెరికా దేశాలు దాటి వచ్చి ఇక్కడ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. కొందరు తమ వ్యవసాయ భూమిని విక్రయించి, ఆ డబ్బులతో అమెరికా వెళ్లినట్లు చెప్పారు. ఇక్కడే ఉపాధి అవకాశాలు ఉంటే యువతకు ఇలాంటి గతి పట్టేదా? ప్రజల తలరాతలు మారాంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలి" అని రాహుల్ గాంధీ అన్నారు.

## భారీ లాభాల్లో ముగిసిన మార్కెట్ సూచీలు



నిఫ్టీ, సెన్సెక్స్ తాజా జీవనకాల గరిష్ఠాలను నమోదు చేశాయి. నిఫ్టీ 26,100, సెన్సెక్స్ 85,800 ఎగువన ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 85,167.56 పాయింట్ల వద్ద (85,169.87) ఫ్లాట్‌గా ప్రారంభమైంది. కొనుగోళ్ల మద్దతుతో లాభాల బాటపట్టింది. ఇంట్రాడేలో 85,106.74 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. తర్వాత 85,930.43 వద్ద జీవనకాల గరిష్ఠాన్ని నమోదుచేసింది. చివరికి 666.25 పాయింట్ల లాభంతో 85,836.12 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 26,250.90 పాయింట్లతో సరికొత్త గరిష్ఠాన్ని తాకింది. చివరకు 211.90 పాయింట్ల లాభంతో 26,216.05 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.65 గా ఉంది. సెన్సెక్స్ 30 (%బాజుచీూజుశ%- 30) సూచీలో మూడు షేర్లు మినహా అన్నీ లాభాల్లో ముగిశాయి. మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్‌ఫైనాన్స్, సన్‌ఫార్మా, నెస్లే ఇండియా, హెచ్‌యూఎల్, అదానీ పోర్ట్స్, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభపడ్డాయి. ఎల్‌అండ్‌టీ, ఎన్టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.36 డాలర్లు వద్ద, బంగారం ఔన్సు 2,692.10 డాలర్ల వద్ద కొనసాగుతున్నాయి.

## బీజేపీ నేత చెప్పిన సమాధానం విని ఆశ్చర్యపోయాను: అరవింద్ కేజ్రీవాల్




తన అరెస్ట్ వల్ల మీకు వచ్చిన లాభం ఏమిటని తాను ఓ బీజేపీ సీనియర్ నేతను అడిగానని... తన ప్రశ్నకు అతను చెప్పిన సమాధానం విని తాను ఆశ్చర్యపోయానని ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. సీఎం అతిశీతో కలిసి ఆయన ఢిల్లీ రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తన అరెస్ట్ వల్ల ఏం లాభం కలిగిందని అడిగితే... ఢిల్లీలో పాలన పట్టాలు తప్పిందని, పనులు ఆగిపోయానని ఓ బీజేపీ నేత సమాధానం చెప్పారని, ఇది విని తాను ఆశ్చర్యపోయానన్నారు. ఢిల్లీలో పనులు ఆగిపోయేలా చేసి, పాలన పట్టాలు తప్పేలా చేసి, ప్రజలకు అసౌకర్యం కలిగించడమే వారి ఉద్దేశమా? అని ప్రశ్నించారు. ఢిల్లీ ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, నిలిచిపోయిన పనులన్నింటినీ మొదలు పెడతానని హామీ ఇచ్చారు. అన్ని సమస్యలు క్రమంగా తొలగిపోతాయన్నారు. తాను జైల్లో ఉన్నప్పుడు కూడా యాక్షన్ మోడ్‌లోనే ఉన్నానని పేర్కొన్నారు.

( మొదటి పేజీ తరువాయి )

## రైతులకు శుభవార్త.. అక్టోబర్ 5న రైతుల ఖాతాల్లోకి డబ్బులు..!



అక్టోబర్ 5న 18 విడత పీఎం కిసాన్ నిధులను అన్నదాతల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు కేంద్రం తెలిపింది. పీఎం కిసాన్ యోజన పథకంలో రైతులకు డబ్బులు రావాలంటే.. తప్పనిసరిగా ఇ కేవైసీ చేసుకోవాలి. ఇ కేవైసీ చేసుకున్న అన్నదాతలకే డబ్బులు జమ చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికీ కూడా ఇ కేవైసీ పూర్తి చేసుకోలేని వారు చేసుకోవాలి అధికారులు కోరుతున్నారు.దీని కోసం రైతులు https://pmkisan.gov.in/ వెబ్ సైట్ కు వెళ్లాలి. అందులో లెఫ్ట్ సైడ్ ఇ కేవైసీ ఆప్షన్ ఉంటుంది. దానిపై క్లిక్ చేయాలి. అప్పుడు మీ ఆధార్ నంబర్ అడుగుతుంది. మీరు ఆధార్ నంబర్ నమోదు చేయాలి. ఆ తర్వాత మీ ఆధార్ కు లింక్ అయిన ఫోన్ నంబర్ ను ఎంటర్ చేయాలి. ఆ తర్వాత మీకు ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్ చేస్తే మీ ఇ కేవైసీ పూర్తి అయినట్లు.రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కొనసాగిస్తోంది. ఇక రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజల కోసం రైతు భరోసా పథకాన్ని కొనసాగిస్తోంది. ఈ పథకం కింద సంవత్సరానికి ఎకరాకు రూ.15 వేలు చెల్లించనున్నారు. అయితే ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ కాలేదు. దీనిపై మార్గదర్శకాలు రూపొందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. రైతు భరోసా నిధులు ఎప్పుడు విడుదల చేస్తారో క్లారిటీ ఇవ్వడం లేదు. మరోవైపు చాలా మంది రైతులు రుణ మాఫీ లేక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్హతలున్నా రుణ మాఫీ కాలేదని వాపోయారు.

## హేమంత్ సర్కార్ ఇంటికే.. భూమ్మీద ఏ శక్తీ ఆపలేదు: రాజ్‌నాథ్ సింగ్



2027 నాటికి అమెరికా, చైనా తర్వాత భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోందని ప్రపంచ ఆర్థికరంగ నిపుణులు అంచనా వేస్తున్నారని తెలిపారు. ధన్‌బాద్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. అవినీతి ఆరోపణలపై జైలుకెళ్లిన ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ గొప్ప వీరుడిలా నటిస్తున్నారని విమర్శించారు.కాల్పులు జరుపుతుంటే.. పోలీసు చప్పట్లు కొడతారా?: బద్లాపుర్ ఎన్‌కౌంటర్‌పై ఫడణవీస్ వ్యాఖ్య అవినీతిపరుడైన సీఎం రాష్ట్రాన్ని అభివృద్ధివైపు నడిపించలేరని రాజ్‌నాథ్ అన్నారు. ఝార్ఖండ్‌లో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చేసేందుకు భాజపాకు వరుసగా రెండు అవకాశాలు ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "మేం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో అందరికీ ఇళ్లు నిర్మిస్తాం. జేఎంఎం, ఆర్జేడీ, కాంగ్రెస్‌లు ఝార్ఖండ్ అభివృద్ధికి ఆటంకంగా ఉన్నాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వల్ల విదేశాల్లో భారతదేశం పరువు దిగజారింది" అని రాజ్‌నాథ్ మండిపడ్డారు. ఝార్ఖండ్ అసెంబ్లీకి వచ్చే ఏడాది జనవరి 5 వరకు గడువు ఉంది. దీంతో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ కసరత్తు చేస్తోంది.

## 24 కోట్ల సీఎంఆర్ ధాన్యం మాయం.. మూడు రైస్ మిల్లుల యజమానులపై క్రిమినల్ కేసులు



మహబూబాబాద్ జిల్లా లోని పలు రైస్ మిల్లుల పై రాష్ట్ర సివిల్ సప్లైస్, టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. 24 కోట్ల 55 లక్షల 33 వేల రూపాయల సి.ఎం.ఆర్ ధాన్యం ను మాయం చేసిన 3 రు రైస్ మిల్లుల యజమానుల పై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ ఓ.ఎస్.డి ప్రభాకర్ మాట్లాడుతూ, ఖరీఫ్ , రబీ లో ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యంను కస్టం మిల్లింగ్ రైస్ (సీఎం ఆర్) జిల్లా లోని పలు మిల్లులకు కేటాయించగా, బియ్యం ను అప్పజెప్పని మిల్లుల పై ఈ దాడులు నిర్వహిస్తున్నామని, ఈ దాడుల్లో విస్తుబోయే నిజాలు భయటపడుతున్నాయని, రైస్ మిల్లుల్లో సరిపోయే వరి ధాన్యం నిలువలు ఉండటం లేదని, ధాన్యాన్ని అమ్ముకున్న మిల్లుల యజమానులపై రెవిన్యూ రికవరీ చట్టం కింద చర్యలు తీసుకోవడమే గాకుండా వారి పైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తాన్నామని తెలిపారు. ఈ టాస్క్ ఫోర్స్ దాడులు నిరంతరం కొనసాగిస్తామన్నారు. మహబూబాబాద్ పట్టణం లోని శ్రీనివాస ఇండస్ట్రీస్ రా, పారా బాయిల్డ్ రైస్ మిల్లులో దాడులు కొనసాగిస్తున్నామని , ఇప్పటి వరకు 20 వేల క్వింటాళ్ల ధాన్యం గుర్తించామని , ఇంకా లెక్కింపు జరుగుతుందని లెక్కింపు పూర్తి అయినా తర్వాత పూర్తి వివరాలు వెల్లడి స్తామన్నారు.

## ఫార్మా సిటీ వ్యవహారంలో కేటీఆర్ సంచలన ఆరోపణలు



ఫార్మా సిటీ విషయంలో తాము రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసినట్లుగా అప్పుడు ఆరోపణలు గుప్పించారని, ఫార్మా సిటీని రద్దు చేసి రైతులకు భూములు తిరిగి ఇచ్చేస్తామని కూడా వారు చెప్పారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఫార్మా సిటీ గురించి రైతులు హైకోర్టును ఆశ్రయించగా... ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు కాలేదని కోర్టుకు చెప్పిందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఫోర్త్ సిటీ అని సీఎం మాట్లాడుతున్నారని, కానీ వీటి కోసం ఎక్క ఎకరమైనా భూసేకరణ చట్టం కింద సేకరించారా? అని ప్రశ్నించారు. వీటి కోసం భూమిని సేకరించకపోతే... తాము గతంలో ప్రతిపాదించిన ఫార్మా సిటీ భూమే అయితే దానిని ఇతర అవసరాలకు ఎలా మళ్లిస్తారని నిలదీశారు. ఫార్మా సిటీ రద్దు కాలేదని చెప్పి, న్యాయమూర్తులను కూడా తప్పుదోవ పట్టించారని, ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఫోర్త్ సిటీ పేరుతో రేవంత్ రెడ్డి ఆయన సోదరులకు వేల కోట్ల రూపాయల లబ్ధి చేకూర్చే కుట్ర జరుగుతోందన్నారు. ఆ కుట్రలో భాగంగానే ఫార్మా సిటీ కొనసాగుతోందని హైకోర్టుకు నివేదిక ఇచ్చి, రద్దు చేస్తున్నట్లు వివిధ సందర్భాల్లో ప్రకటించారని ఆరోపించారు. ఫార్మా సిటీ వెనుక జరిగిన వేల కోట్ల రూపాయల కుంభకోణాన్ని త్వరలో బయటపెడతామని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో 14 వేల ఎకరాల్లో రూ.64 వేల కోట్ల పెట్టుబడులతో ఫార్మా సిటీని ప్రతిపాదించామన్నారు. నిబంధనల ప్రకారమే తాము భూసేకరణ చేపట్టామన్నారు. ఆ భూములను ఇతర అవసరాలకు మళ్లించవద్దన్నారు. ఈ 14 వేల ఎకరాల్లో ఫార్మా సిటీని ఏర్పాటు చేయకుంటే రైతులకు తిరిగి ఇచ్చేయాల్సి ఉంటుందన్నారు.

## మతపరమైన ర్యాలీల్లో డీజే, టపాసుల వాడకంపై రౌండ్ టేబుల్ సమావేశం



హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అధ్యక్షతన మతపరమైన ర్యాలీల్లో డీజే, టపాసుల వాడకం పై రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హైదరాబాద్, రాచకొండ సీపీ లు హాజరయ్యారు. వీరితో పాటు %+ఎవీజ% కమిషనర్ అమ్రాపాలి, కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, బీజేపీ ఎమ్మెల్యే రాజాజసింగ్, %వీ×వీ% ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల ప్రతినిధులు, మత సంఘాల నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. డీజే శబ్దాల మీద అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, నివాసాల్లో వయసు మీరిన వారు ఇబ్బంది పడుతున్నారన్నారు.గుండె అదురుతోందని ఆందోళన చెందుతున్నారని, డీజే సౌండ్స్ ఈసారి శృతి మించాయన్నారు సీపీ సీవీ ఆనంద్. గణేష్ పండుగే కాదు.. మిలాద్ ఉన్ నబి లో డీజే నృత్యాలు విపరీతం అయ్యాయని ఆయన వ్యాఖ్యానించారు. పబ్బుల్లో నృత్యాలు చేసినట్లే ర్యాలీల్లో చేస్తున్నారని, మాకు అనేక సంఘాలు వినతులు ఇచ్చారన్నారు. డీజే శబ్దాలు కట్టడి చేయాలని కోరారని, అందుకే పలు వర్గాలను పిలిచామని ఆయన వెల్లడించారు. అందరి అభిప్రాయం తీసుకుని ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని, మా నివేదిక ఇచ్చిన తర్వాత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఆయన తెలిపారు. డీజే శబ్దాల పై కంట్రోల్ లేకపోతే ఆరోగ్యాలు దెబ్బ తింటాయని, శబ్ద కాలుష్యంతో పర్యావరణానికి కూడా హానికరమన్నారు సీపీ సీవీ ఆనంద్.

## పేదలకు అన్యాయం జరగకుండా అండగా ఉంటాం: ఎమ్మెల్యే



శాసనసభ / హైదరాబాద్: హైడ్రాపై చట్టబద్ధంగా పోరాటం చేద్దామని మల్కాజ్ గిరి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం మౌలాలీ డివిజన్ శివనంద్ నగర్ కాలనీవాసులు ఎమ్మెల్యేను కలిశారు. కొన్నేళ్ల క్రితం శివానంద నగర్లో అన్ని అనుమతులతో ఇండ్లు నిర్మించుకున్నామని దానికి ఇటీవల హైడ్రా నోటీసులు జారీ చేసిందని వాపోయారు. న్యాయ నిపుణులతో సూచనలు తీసుకుని ముందుకెళదామని, పేదలకు అన్యాయం జరగకుండా అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# ఐ & పీఆర్‌లో అవినీతి బాణం




శాసనసభ /హైదరాబాద్ 'ఇందుగలడందులేడు..' అన్నట్టుగా ప్రభుత్వంలోని అన్ని శాఖలపై బిగ్ బ్రదర్స్ పంజా విసురుతున్నారు. తాజాగా సమాచార, ప్రజా సంబంధాల శాఖపై (ఐ అండ్ పీఆర్) 'బాణం' విసిరారు. వారి అండతో ఐ అండ్ పీఆర్ విభాగంలో కొన్ని నెలలుగా విచ్చలవిడిగా భారీ అవినీతి బాగోతం జరుగుతున్నది. అధికారిక గుర్తింపు లేని సంస్థకు అక్రమంగా రూ.పదుల కోట్ల ప్రకటనలు కట్టబెడుతున్నారు. ఈ క్రమంలో మంత్రి సిఫారసు చేసిన సంస్థను సైతం పక్కన పడేసి.. 'ఇండియన్ న్యూస్ పేపర్స్ సొసైటీ' సస్పెండ్ చేసిన ఏజెన్సీకి విచ్చలవిడిగా వర్క్ ఆర్డర్లు ఇవ్వడం గమనార్హం. ఐ అండ్ పీఆర్ తాజాగా రూపొందించిన ప్యానల్ ఏజెన్సీల్లో ఆ సంస్థ లేకపోవడం మరో విచిత్రం.

**ఏజెన్సీలు.. అనుసంధానకర్తలు**

ప్రభుత్వం ఏదైనా అంశంపై పత్రికల ద్వారా ప్రచారం చేయాలనుకున్నప్పుడు అడ్వర్టైజింగ్ ఏజెన్సీ ద్వారా పత్రికలకు ప్రకటనలు జారీ చేస్తుంది. ఢిల్లీ కేంద్రంగా నడిచే 'ద ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ' దేశవ్యాప్తంగా ఉన్న అడ్వర్టైజింగ్ ఏజెన్సీలకు అక్రెడిటేషన్ (గుర్తింపు) ఇస్తుంది. ఆ అక్రెడిటేషన్ ఉన్న ఏజెన్సీల్లో కొన్నింటిని ఐ అండ్ పీఆర్ విభాగం ఎంచుకుంటుంది. వీటిని ప్యానల్ ఏజెన్సీలు అని పిలుస్తారు. ప్రతి మూడేండ్లకు ఒకసారి జాబితాను రెన్యువల్ చేస్తుంది. ఈ ఏజెన్సీలు ప్రభుత్వానికి, పత్రికలకు మధ్య అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తుంటాయి. ప్రభుత్వం ఇచ్చే ప్రకటనలకు సంబంధించి డిజైన్ రూపొందించడం, వాటిని పత్రికలకు ఇవ్వడం, ప్రభుత్వం నుంచి బిల్లులు వసూలు చేసి పత్రికలకు అందజేయడం వంటివి వాటి బాధ్యత. ప్రభుత్వం ఒక ప్రకటన జారీ చేసే ముందు డిజైన్లు సమర్పించాలని ప్యానల్ ఏజెన్సీలకు సూచిస్తుంది. ఉత్తమ డిజైన్‌ను గుర్తించి ఆ ఏజెన్సీకి వర్క ఆర్డర్ ఇచ్చి, ప్రకటనలు జారీ చేస్తుంది. ప్రకటన జారీ అయిన 60 రోజుల్లోగా ఏజెన్సీలు ప్రభుత్వం నుంచి బిల్లులు వసూలు చేయించి, పత్రికలకు చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో కొంత భాగం ఏజెన్సీలకు కమిషన్‌గా వెళ్తుంది. ఈ ఏజెన్సీల పనితీరుపై ఎప్పటికప్పుడు ఐఎన్ఎస్ సమీక్షిస్తుంది. సరిగా పనిచేయని ఏజెన్సీల అక్రెడిటేషన్‌ను సస్పెండ్ చేస్తుంది.

**మార్చిలోనే సస్పెన్షన్.. అయినా ఆర్డర్**

రాష్ట్రంలో దాదాపు 50కిపైగా ప్యానల్ ఏజెన్సీలు ఉన్నాయి. ఇందులో 'యారో అడ్వర్టైజింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' ఏజెన్సీ ఒకటి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు రూ.110 కోట్ల మేర పత్రికలకు ప్రకటనలు ఇచ్చినట్టు సమాచారం. ఇందులో 80-90 శాతం ప్రకటనల ఆర్డర్లు యారో అడ్వర్టైజింగ్ ఏజెన్సీకే దక్కాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే.. యారో అడ్వర్టైజింగ్ ఏజెన్సీ అక్రెడిటేషన్‌ను ఐఎన్ఎస్ ఈ ఏడాది మార్చి 22న సస్పెండ్ చేసింది. సంస్థ నుంచి పత్రికలకు బిల్లుల చెల్లింపుల తీరు సరిగా లేకపోవడం వల్ల ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు అందులో పేర్కొన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం ఆగకుండా 'యారో' కంపెనీకి ప్రకటనల ఆర్డర్లు కట్టబెడుతూనే ఉన్నది. తాజాగా.. ఈ నెల 13వ తేదీన రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, సీతారామా లిఫ్ట్ ప్రారంభానికి సంబంధించిన ప్రకటనలను యారో ఏజెన్సీ ద్వారానే ఇచ్చింది. మొత్తం 31 పత్రికల్లో ప్రకటనలకు రూ.10.10 కోట్ల ఆర్డర్ ఇచ్చారు. ఇదొక్కటే కాదని, ఐఎన్ఎస్ సస్పెండ్ చేసిన తర్వాత ఐ అండ్ పీఆర్ నుంచి రూ.పదుల కోట్ల వర్క్ ఆర్డర్ ఇచ్చిందని చెప్తున్నారు. జూన్‌లోనూ రూ.1.50 లక్షల వరకు రుణమాఫీ పేరుతో 31 పత్రికలకు రూ.7.34 కోట్ల వర్క్ ఆర్డర్ ఇచ్చిందని చెప్తున్నారు. వారం రోజుల కిందట ఐ అండ్ పీఆర్ విభాగం తయారుచేసిన ప్యానల్ ఏజెన్సీల జాబితాలోనూ యారో సంస్థకు చోటు దక్కలేదు. దీనిని బట్టే కంపెనీ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

**మంత్రి చెప్పినా పట్టించుకోలే**

యారోతో సమానంగా తమ సన్నిహితులకు చెందిన కంపెనీకి కూడా వర్క్ ఆర్డర్లు ఇవ్వాలని ఓ మంత్రి స్వయంగా ఈ ఏడాది మార్చిలో సిఫారసు చేసినట్టు సమాచారం. దీంతో మొహమాటానికి రెండు నెలలపాటు కొంత ఆర్డర్లు ఇచ్చారని చెప్పుకుంటున్నారు. కానీ.. ఆ తర్వాత మళ్లీ ఆర్డర్లు మొత్తం యారో కంపెనీకే కట్టబెట్టారని చెప్పుకుంటున్నారు. అదేమని అడిగితే.. ఎవరికి ప్రకటనలు ఇవ్వాలో 'బిగ్ బ్రదర్స్' ఆదేశిస్తున్నారని, తాము పాటిస్తున్నామని అధికారులు చెప్తున్నారని సమాచారం. సాధారణంగా ప్రభుత్వాలు ఒక ప్రకటనను రెండుమూడు ఏజెన్సీలకు కలిపి ఇస్తుందని, దీంతో అన్నింటికీ పని దొరుకుతుందని చెప్తున్నారు. ఒకటి రెండు ఏజెన్సీలకు కొద్దిగా ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం కూడా సహజమేనన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచీ ఏకపక్షంగా యారోకే వర్క్ ఆర్డర్లు ఇచ్చినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో మిగతా ఏజెన్సీలకు పనిలేకుండా, దివాళా తీసే పరిస్థితి తలెత్తిందని నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**బిల్లులు ఎలా చెల్లిస్తారు?**

ఐఎన్ఎస్ ప్రకారం యారో అడ్వర్టైజింగ్ ఏజెన్సీ గుర్తింపు ఈ ఏడాది మార్చిలోనే రద్దయింది. నిబంధనల ప్రకారం ఆ ఏజెన్సీకి ఐ అండ్ పీఆర్ వర్క్ ఆర్డర్ ఇవ్వరాదు. కానీ తెలంగాణలో యారో ఏజెన్సీకి మార్చి తర్వాత సైతం విచ్చలవిడిగా వర్క్ ఆర్డర్లు జారీ అయినట్టు చెప్తున్నారు. మరి గుర్తింపు లేని కంపెనీకి ప్రభుత్వం బిల్లులు ఎలా చెల్లిస్తుందని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. యారో ఏజెన్సీ బాగోతం తెలిసిన కొన్ని పత్రికలు ఆ ఏజెన్సీ ఇచ్చిన ప్రకటనలు వేసేందుకు ఒప్పుకోలేదట. దీంతో థర్డ్ పార్టీ ఏజెన్సీల ద్వారా ప్రకటనలు వేయించినట్టు చెప్పుకుంటున్నారు. ఇది కూడా నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేస్తున్నారు. మరి పత్రికలకు ఆ బిల్లులు ఎలా చెల్లిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఐ అండ్ పీఆర్ శాఖలో జరిగిన ఈ అవినీతిని పూర్తిగా వెలికి తీసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

3 SHASANA SABHA TELUGU DAILY
శాసనసభ
తెలుగు దినపత్రిక
శుక్రవారం 27 సెప్టెంబర్ - 2024

# గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే ఈ జాగ్రత్తలు తప్పనిసరి.!

ప్రస్తుత కాలంలో, వృద్ధులలోనే కాకుండా యువతలో కూడా గుండె జబ్బుల ప్రమాదం వేగంగా పెరుగుతోంది. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో కూడిన జీవితం ఇందుకు ప్రధాన కారణాలు.ప్రపంచ హృదయ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 29న జరుపుకుంటారు. ఈ రోజు గుండె జబ్బుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా గుండె సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. గుండె జబ్బులు రాకుండా ఉండాలంటే ఎలాంటి అలవాట్లు పాటించాలో తెలుసుకుందాం.

**రెగ్యులర్ వ్యాయామం:**

శారీరక శ్రమ లేకపోవడం కూడా గుండె జబ్బులకు ప్రధాన కారణం. వాకింగ్, జాగింగ్ లేదా సైక్లింగ్ వంటి 30 నిమిషాల శారీరక శ్రమను ప్రతిరోజూ చేయండి. ఇది గుండెను బలపరుస్తుంది. శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా చేస్తుంది. తద్వారా ఊబకాయం, రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది.



**సమతుల్య ఆహారం:**

గుండె ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల్య ఆహారం చాలా ముఖ్యం. జంక్ ఫుడ్, చక్కెర, అధిక కేలరీల ఆహారాన్ని నివారించండి. వీటికి బదులుగా, మీ ఆహారంలో బాదం, వాల్‌నట్స్, అవకాడో, క్యారెట్ వంటి పోషకాలు అధికంగా ఉండే ఆహారాలను చేర్చండి. ఈ విషయాలు గుండె సిరలను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి.

**ఒత్తిడిని తగ్గించండి:**

ఎక్కువ సేపు మెలకువగా ఉండడం, ఎలక్ట్రానిక్ గాడ్జెట్ లను ఎక్కువగా ఉపయోగించడం వల్ల గుండెపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అటువంటి పరిస్థితిలో, తగినంత నిద్ర (7–8 గంటలు) తీసుకోండి. ఒత్తిడిని తగ్గించడానికి యోగా, ధ్యానం చేయండి. ఇది శరీరం ఒత్తిడి స్థాయిని తగ్గిస్తుంది. ఇది గుండెకు ప్రయోజనకరంగా ఉంటుంది.

**జీవనశైలిని మెరుగుపరచండి:**

మీ హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి మీ జీవనశైలిని మెరుగుపరచుకోండి. పోషకాహారం, తగినంత నిద్ర, ఒత్తిడిని తగ్గించడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను స్వీకరించండి. దీనితో మీరు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చు.

**ఆరోగ్య తనిఖీ:**

గుండె సంబంధిత సమస్యను గుర్తించి, సకాలంలో చికిత్స పొందడం చాలా ముఖ్యం. కాబట్టి, మీ గుండెను క్రమం తప్పకుండా తనిఖీ చేయండి. డాక్టర్ సలహాను అనుసరించండి.

# పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులివ్వండి



శాసనసభ / హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు.అలాగే, జాతీయ ఉపాధి హామీ పథకానికి కేంద్రం రూ.1200 కోట్లు విడుదల చేసినా రాష్ట్ర ప్రభుత్వం తన మెటీరియల్ కాంపొనెంట్ కింద 25 శాతం నిధులను విడుదల చేయకపోవడాన్ని ఆక్షేపించారు. ఈ మేరకు ఆయా నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు గురువారం ఓ లేఖ రాశారు. సచివాలయం ముందున్న రాజీవ్ గాంధీ విగ్రహం సాక్షిగా ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టాలను తుంగలో తొక్కడం దారుణమని హరీశ్ పేర్కొన్నారు.ఎనిమిది నెలలుగా నిధులు లేకపోవడంతో గ్రామాలు మురికి కుపాలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు వేతనాలు అందడం లేదని, పదవీకాలం పూర్తి చేసుకున్న సర్పంచ్‌లకు వేతన బకాయిలున్నాయని, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులకు ఎనిమిది నెలలుగా గౌరవ వేతనాలు అందడం లేదని వివరించారు. అక్టోబరులో రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులను సాధించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, "పంటల సాగులో మేటిగా.. దేశానికే ఆదర్శంగా తెలంగాణ నిలిచింది. ధాన్యం ఉత్పత్తిలో నంబర్ వన్ స్థానంతోపాటు పత్తి ఉత్పత్తిలో మూడోస్థానంలో నిలవడం గర్వకారణం" అని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఇదంతా ఏదో మంత్రం వేస్తేనో.. మాయ చేస్తేనో జరిగింది కాదని, కేసీఆర్ తొమ్మిదేళ్ల కృషితో సాధించిన ఘనత అని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

# పేదల ఇళ్లను కూల్చే హక్కు ప్రభుత్వానికి లేదు



శాసనసభ / హైదరాబాద్: పేదలు జీవిత కాల సంపాదనతో నిర్మించుకున్న ఇళ్లను కూల్చే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి లేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీలు ఇచ్చిన అనుమతులు తప్పని 'హైడ్రా' ఎలా నిర్ణయిస్తుందని ప్రశ్నించారు. ఒక సంస్థ అనుమతులిస్తే.. కొత్తగా మరో సంస్థను ఏర్పాటు చేసి, అక్రమమంటూ కూలగొట్టడం ఎంతవరకు సమంజసం? అని నిలదీశారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలో అక్రమ నిర్మాణాలను రెగ్యులరైజ్ చేశారని గుర్తు చేశారు. ఏ ప్రభుత్వాలైనా పేదలకు ఇళ్లు, రోడ్లు, భవనాలు, బ్యారేజీలు, బ్రిడ్జిలు, ఆస్పత్రులు, విద్యాసంస్థలను నిర్మిస్తాయని, ఈ సర్కారు హైడ్రా పేరుతో.. నిర్మాణాలను తొలగిస్తూ ఏకపక్షంగా వెళ్తోందని తప్పుబట్టారు.హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో బాధితులు తన దృష్టికి తీసుకొచ్చిన అంశాలు, మేధావుల ఆలోచనలు, మీడియా ద్వారా తెలుసుకున్న అంశాలతో కిషన్‌రెడ్డి గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. పేదల ఆందోళన, ఆవేదనను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. పైగా హైడ్రాకు మరిన్ని అధికారాలు కల్పించడాన్ని తప్పుబట్టారు. "బీఆర్ఎస్ ప్రభుత్వం విచ్చలవిడిగా అప్పులు చేసి రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసింది. దీన్ని సాకుగా చూపి, మౌలిక వసతుల కల్పనకు డబ్బుల్లేవంటున్నారు. అక్రమ కట్టడాల పేరిట ఇళ్లను కూల్చివేస్తున్నారు. ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను మేం సమర్థించం.అయితే, వాటిపై తీసుకునే చర్యలు న్యాయబద్ధంగా, సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగా ఉండాలి. ముఖ్యంగా.. పేద, మధ్య తరగతి ప్రజల విషయంలో వీటి ఆధారంగానే పని చేయాలి" అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తప్పుడు లే అవుట్‌లతో మభ్యపెట్టి, పెట్టుబడులు పెట్టించి స్థలాలు, ఫ్లాట్లు అమ్మినవారిని కూడా బాధ్యులను చేసేలా కఠినమైన చట్టాలు తీసుకురావాలని కోరారు. పేదలపై ప్రతాపం చూపకుండా హైడ్రా తొలుత వారితో మాట్లాడాలన్నారు. ఇతర భాగస్వామ్య పక్షాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు.కోట్లు ఖర్చుపెట్టి వసతులు కల్పించారుగా? ఇప్పుడు అక్రమ నిర్మాణాలుగా చెబుతున్న ప్రాంతాల్లో ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి రోడ్లు, వీధి దీపాలు, తాగు నీరు, డ్రైనేజీ, విద్యుత్తు కనెక్షన్లు, కమ్యూనిటీ హాళ్లు, చివరకు ఇంటి నంబర్లను కూడా ఇచ్చిందని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. దశాబ్దాలుగా జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏల ద్వారా పన్నులు తీసుకుంటూ హఠాత్తుగా అక్రమం అంటే పేద, మధ్య తరగతి ప్రజలు ఏమైపోవాలి? అని నిలదీశారు. అప్పులు చేసి, బ్యాంక్ రుణాలు పొంది.. ఫ్లాట్లు, అపార్టుమెంట్లు కొనుక్కున్నారని.. కొన్నిచోట్ల అన్ని అనుమతులున్న భవనాలనూ నేలమట్టం చేయటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ పరివాహకంలో 15 వేలపైగా పేద, మధ్య తరగతి కుటుంబాలున్నాయని.. వారి నివాసాలను హైడ్రా ద్వారా కూల్చేముందు చర్చించాలని కోరారు. 20 ఏళ్ల క్రితం కాంగ్రెస్, పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మోసానికి ప్రజలు బలయ్యారని ఆరోపించారు. ముఖ్యమంత్రిగా రేవంత్ తీసుకునే నిర్ణయం.. అందరికీ న్యాయం జరిగేలా ఉండాలని కిషన్‌రెడ్డి ఆకాంక్షించారు.

# కాళేశ్వరం కట్టిన ఇంజనీర్లను ఆదర్శంగా తీసుకోకండి



శాసనసభ / హైదరాబాద్: కొత్తగా వచ్చే ఇంజనీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్య, నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ వంటి వారినే ఆదర్శంగా తీసుకోవాలని, కాళేశ్వరం కట్టిన ఇంజనీర్లను కాదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సూచించారు.రాష్ట్రంలో కొన్ని ప్రాజెక్టులు కట్టిన వెంటనే కూలిపోయి ఇంజనీర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసిన సంఘటనలను చూశామంటూ ఆయన కాళేశ్వరం ప్రాజెక్టును గుర్తుచేశారు. అలాంటి నిర్మాణాలను సూచించిన ఇంజనీర్లను కనీసం కలలోకి కూడా రానివ్వొద్దంటూ ఆయన నూతన ఏఈఈలకు సలహా ఇచ్చారు.హైదరాబాద్, హైటెక్స్ ప్రాంగణంలోని న్యాక్‌లో ఆర్ అండ్ బీ శాఖకు కొత్తగా రాబోతున్న 156 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు శాఖపరమైన అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న 5 రోజుల ఓరియెంటేషన్ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత ప్రభుత్వం 10 మండలాలకు ఒక ఇంజనీర్ కూడా లేని దుస్థితికి రాష్ట్రాన్ని తీసుకొచ్చిందని, తాము నియామకాలను పూర్తి చేస్తూ ఆర్ అండ్ బీని పటిష్టం చేస్తున్నామని తెలిపారు. కొందరు పాలకులు, అతికొద్దిమంది ఇంజనీర్ల స్వార్థం ఇంజనీర్లందరికి మాయని మచ్చగా మారిందన్నారు. కాగా ఆర్ అండ్ బీకి ఎంపికైన ఇంజనీర్లకు త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలను అందజేయనున్నట్టు శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన ప్రకటించారు.

# నవంబరు నుంచి కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు!



శాసనసభ / హైదరాబాద్: భూముల మార్కెట్ విలువలు పెంచాలని సర్కారు నిర్ణయించిన నేపథ్యంలో నవంబరు 1 నుంచి సవరించిన కొత్త రిజిస్ట్రేషన్ విలువలు అమల్లోకి రానున్నాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పెంచనున్న మార్కెట్ విలువలపై విమర్శలు తలెత్తకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. గురువారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. విలువల పెంపు శాస్త్రీయంగా ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు.కాంట్రాక్టు ఏజెన్సీ అయిన సెంటర్ ఫర్ ఎఫెక్టివ్ గవర్నెన్స్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్ (సీఈజీఐఎస్) ఇచ్చే నివేదికపైనే ఆధారపడకుండా, రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల నుంచి కూడా ప్రతిపాదనలనూ పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనున్నామన్నారు. అక్టోబరు 15 లోపల నివేదిక ఇస్తుందని, ఆ వెంటనే మార్కెట్ విలువల సవరణపై నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా, ప్రస్తుతం చదరపు అడుగు ఫ్లాట్ ధర రిజిస్ట్రేషన్ శాఖ విలువ ప్రకారం నగరాల్లో సగటున రూ.3200గా ఉంటే దీన్ని 30 శాతం(రూ.960) మించకుండా పెంచే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. సాగు భూములు, స్థలాల విషయంలో ఇప్పుడున్న విలువను సవరించి గజం ధర రూ.1,000 ఉంటే దాన్ని రూ.2 వేలకు పెంచాలనే ప్రతిపాదనలున్నాయి.వచ్చే నెల నుంచి అమల్లోకి..వచ్చే నెల నుంచి కొత్త రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్వోఆర్–2024) చట్టం అమల్లోకి రానుందని మంత్రి తెలిపారు. ఇందుకు అవసరమైన సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు. ఆర్వోఆర్ ముసాయిదాపై వివిధ వర్గాల నుంచి సేకరించిన సలహాలు, సూచనలు, కలెక్టర్లు పంపిన నివేదికలపై ఇప్పటికే తుది నిర్ణయం తీసుకున్నామన్నారు. అయితే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి చట్టం తేవడమా లేక ఆర్డినెన్స్ ద్వారా తీసుకురావడమా అనే దానిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. గత నెలలో కర్ణాటక పర్యటనకు వెళ్లి వచ్చిన ధరణి కమిటీ సభ్యులు.. ప్రతిపాదించిన అంశాలనూ చట్టంలో పొందుపరిచే విషయాన్ని పరిశీలిసున్నామన్నారు. కొత్త చట్టం అమల్లోకి వస్తే ధరణితో పాటు చాలావరకు భూసమస్యలకు పరిష్కారం దొరుకుతుందని చెప్పారు.ధరణిలో 3.10 లక్షల పెండింగ్ దరఖాస్తుల్లో ఇప్పటికీ 1.10లక్షలు అపరిష్కృతంగా ఉన్నాయని.. వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించినట్లు వెల్లడించారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను తిరిగి బలోపేతం చేస్తామని చెప్పారు. వీఆర్వో, వీఆర్ఏ నియామకాలకు సంబంధించి... అభ్యర్థుల సామర్థ్యాలను గుర్తించేందుకు పరీక్ష పెట్టి ఎంపిక చేస్తామని వివరించారు. అభ్యర్థులకు డిగ్రీ విద్యా అర్హతగా నిర్ణయించామన్నారు. పాత వారిని తిరిగి రెవెన్యూ సర్వీసులోకి తీసుకోవాలన్నా పరీక్ష రాయాల్సిందేనని స్పష్టం చేశారు. కాగా, రిజిస్ట్రేషన్ శాఖలో ఇటీవల జరిగిన బదిలీల్లో కొంతమంది అధికారులు వసూళ్లకు పాల్పడటంపై మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని జాగ్రత్తలు తీసుకుని బదిలీలు చేసినా.. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చిన వారిని ఈడ్చి కొడతానని ఘాటుగా వ్యాఖ్యానించారు. బదిలీల్లో ఎవరు వసూళ్లకు పాల్పడ్డారో ఆ వివరాలు తన దగ్గర ఉన్నాయని, వారిని ఉపేక్షించేది లేదన్నారు.

# ఈ ఏడాదే 10 లక్షల ఇందిరమ్మ ఇళ్లు..



శాసనసభ / హైదరాబాద్: ప్రతిష్ఠాత్మకంగా భావిస్తూ.. అర్హులైన పేదలందరికీ లబ్ధి చేకూర్చాలని చూస్తున్న ఇందిరమ్మ ఇంటి పథకంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. పథకం అమలుకు కావాల్సిన విధివిధానాలు, మార్గదర్శకాలను కొలిక్కితెచ్చింది. తొలుత ఈ ఆర్థిక సంవత్సరంలో 4.50 లక్షల ఇళ్లను ఇవ్వాలని నిర్ణయించినా వాటిని 10 లక్షలకు పెంచినట్లు తెలిసింది. పథకాన్ని అత్యంత పారదర్శకంగా అమలు చేసేందుకు అప్ డేటెడ్ సాఫ్ట్‌వేర్ వినియోగంతో పాటు, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీలను నియమించనుంది.పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్, ఒకరిద్దరితో కలిపి ఐదారుగురితో గ్రామ కమిటీలను వేయనున్నారు. మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి అధికారులతో ఆయా కమిటీలను ఏర్పాటు చేస్తారు. నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4,16,500 ఇళ్లు ఇవ్వాలని, రిజర్వ్ కోటా కింద 33,500ఇళ్లను ప్రభుత్వ విచక్షణ (రిజర్వ్ కోటా)లో ఉంచాలని గతంలో భావించింది. ఇప్పుడు 10 లక్షలకు పెంచనుండడంతో ఈ కోటా కూడా పెరగనుంది. డిసెంబరులో నిర్వహించిన ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం 82 లక్షల దరఖాస్తులు రాగా, వీటిలో పట్టణాల్లోవి 23.50 లక్షలు, గ్రామాల్లోవి 58.50 లక్షలున్నాయి. మొదటి దశలో.. అంటే ఈ ఆర్థిక సంవత్సరంలో సొంత స్థలం ఉన్నవారికి, రెండో దఫాలో స్థలం లేనివారికి ఇవ్వనున్నారు.

సిబ్బంది వచ్చేశారు..ఇందిరమ్మ పథకానికి ఉద్యోగులను సమకూరుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. హౌసింగ్ కార్పొరేషన్ కింద పనిచేసి వివిధ శాఖలు, సంస్థలకు డిప్యూటేషన్‌పై వెళ్లిన 242 మందిని వెనక్కి తీసుకొచ్చింది. వీరందరూ ఇందిరమ్మ పథకాన్ని పర్యవేక్షించాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకాన్ని చేపట్టినా హౌసింగ్ కార్పొరేషన్ సేవలను పెద్దగా వినియోగించుకోలేకపోయింది. ఉద్యోగులను వివిధ శాఖలు, కార్పొరేషన్లు, బోర్డులకు డిప్యూటేషన్‌పై పంపించింది. హౌసింగ్ కార్పొరేషన్‌ను రోడ్లు భవనాల శాఖలో విలీనం చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 'అభయ హస్తం' కింద ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని చేపట్టింది. పర్యవేక్షణకు ఉద్యోగులు అవసరం కావడంతో డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉద్యోగులను హౌసింగ్ కార్పొరేషన్‌కు రప్పించింది.

కేంద్ర పథకంతో అనుసంధానం..ఇందిరమ్మ పథకాన్ని పీఎం ఆవాస యోజనకు అనుసంధానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పథకానికి సంబంధించి సంయుక్త పర్యవేక్షణకు అధ్యక్షుడిగా జిల్లా ఇంచార్జి మంత్రి, జిల్లా చైర్మన్‌గా కలెక్టర్ ఉండనున్నారు. బిల్లులు దశలవారీగా చెల్లించనున్న నేపథ్యంలో.. ఆలస్యం లేకుండా అందించేలా గ్రీన్ చానల్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. సాంకేతిక అంశాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రామ స్థాయిలో అర్హుల జాబితాను గ్రామ కమిటీ ఖరారు చేసి, ఎండీవోకు పంపుతారు. ఎండీవో మరోసారి పరిశీలన చేసి కలెక్టర్‌కు అందజేస్తారు. కలెక్టర్, జిల్లా ఇంచార్జి మంత్రి జాబితాపై నిర్ణయం తీసుకుంటారు. మరోవైపు అర్హుల ఎంపికలో 360 డిగ్రీల సాఫ్ట్‌వేర్‌తోపాటు, శాటిలైట్ జియో ట్యాగింగ్‌ను నియోగించనున్నారు. తొలి విడత లబ్ధి సొంత స్థలం ఉన్నవారికే అందనుంది. అందులోనూ మొదట నిరుపేదలకు, ఆ తరువాత పేదలకు ఇళ్లను అందించనున్నారు.

# లోడెత్తలేదు.. సీఎంఆర్ ఇవ్వలేదు!



శాసనసభ / హైదరాబాద్: టెండర్ అగ్రిమెంటు చేసుకొని తొమ్మిది నెలలు గడిచినా.. ఇంతవరకూ పౌరసరఫరాల సంస్థకు చెల్లించాల్సిన డబ్బులు చెల్లించలేదు. రైస్‌మిల్లుల నుంచి ధాన్యం లోడెత్తలేదు. వేలంపాటలో దక్కించుకున్న కాంట్రాక్టు ఏజెన్సీలు.. ఆడిందే ఆట, పాడిందే పాట అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. ఫలితంగా రెండేళ్ల కిందటి రబీ ధాన్యం 25 లక్షల మెట్రిక్ టన్నులు.. ఇంకా రైస్‌మిల్లుల్లోనే మూలుగుతోంది. మరోవైపు రైస్‌మిల్లర్లు భారత ఆహార సంస్థకు ఇవ్వాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ లక్ష్యాన్ని పూర్తిచేయకుండా మొండికేస్తున్నారు. నాలుగురోజుల్లో అక్టోబరు నెల వస్తోంది. అక్టోబరులో 91 లక్షల టన్ను ఖరీఫ్ ధాన్యం సేకరణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. కానీ.. పాత నిల్వలు లక్షల టన్నులు ఉండగా... కొత్త ధాన్యం నిల్వచేయటానికి చోటెక్కడ? అనే ఆందోళన వ్యక్తమవుతోంది.టెండర్లలో అక్రమాలు జరిగాయని, పౌరసరఫరాల సంస్థకు భారీ నష్టం అని ఆరోపణలు రావటంతో టెండర్లు రద్దుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ టెండర్లు పిలిచారు. ఇప్పుడు క్వింటాలుకు సగటున రూ.2 వేల రేటు వచ్చింది. కానీ అప్పుడు ఏ ఏజెన్సీలకు టెండర్లు దక్కాయో? ఇప్పుడు కూడా అవే ఏజెన్సీలకు టెండర్లు దక్కటం చర్చనీయాంశంగా మారింది. కానీ ఈ ఏజెన్సీలు నిర్ణీత గడువులో రైస్‌మిల్లుల 23– 24)లో ప్రభుత్వం ధాన్యం ప్రొక్యూర్మెంట్ చేసింది. ఖరీఫలో 47.34 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలుచేసి రైస్‌మిల్లర్లకు అప్పగించింది. 32 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సీఎంఆర్ రూపంలో ఇవ్వాల్సి ఉండగా... ఇంకా 21 లక్షల టన్నుల సీఎంఆర్ రిక వరీ కాలేదు. ఇందుకు సంబంధించిన ధాన్యం కూడా రైస్‌మిల్లుల్లో నిల్వ ఉండటం గమనార్హం.

# హూవర్ డ్యామ్ స్ఫూర్తితో.. జల విద్యుత్తు ప్రాజెక్టుల సామర్థ్యం పెంచండి



శాసనసభ / హైదరాబాద్: అమెరికాలోని నెవాడా, అరిజోన రాష్ట్రాల సరిహద్దులో కొలరాడో నదిపై నిర్మించిన హూవర్ జల విద్యుత్తు డ్యామ్‌ను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలోని జల విద్యుత్తు ప్రాజెక్టుల సామర్థ్యం పెంపుపై దృష్టి పెట్టాలని రాష్ట్ర అధికారులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు.అమెరికా పర్యటనలో భాగంగా ఆయన బుధవారం హూవర్ డ్యామ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అమెరికా అధికారులు ప్రాజెక్టు గురించి భట్టికి వివరించారు. తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్న 1931– 36 మధ్య ఈ ప్రాజెక్టును నిర్మించారని, దీని ద్వారా 2080 మెగావాట్ల జల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని తెలిపారు.ఈ డ్యామ్ మూడు రాష్ట్రాల విద్యుత్తు అవసరాలను తీరుస్తుందని చెప్పారు. మూడు ప్రధాన పట్టణాల్లోని 80 లక్షల మంది ప్రజలకు మంచినీటిని అందిస్తుందని, సాగునీటి అవసరాలు కూడా తీరుస్తుందని వివరించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ, హూవర్ డ్యామ్ జల విద్యుత్తు ఉత్పాదకతను స్ఫూర్తిగా తీసుకుని, రాష్ట్రంలోని ప్రాజెక్టుల సామర్థ్యం పెంపుదలకు, రక్షణకు గల అవకాశాలను పరిశీలించాలని ఆయనతో పాటు ఉన్న రాష్ట్ర విద్యుత్తుశాఖ కార్యదర్శి రొనాల్డ్ రోస్, సింగరేణి ఎండీ బలరామ్‌కు సూచించారు.

శాసనసభ తెలుగు దినపత్రిక

శుక్రవారం 27 సెప్టెంబర్ - 2024

# దేవర మూవీ యూఎస్ఏ రివ్యూ.హిట్టా ఫట్టా..?

తెలుగు సినిమా ఇండస్ట్రీ ప్రస్తుతం కొత్త పంథాలు తొక్కుతుంది. ఇక ఇలాంటి క్రమంలోనే కొత్త కథలతో సినిమాలను చేస్తూ ముందుకు సాగుతున్న విషయం మనకు తెలిసిందే.మరి ఇలాంటి క్రమంలో మన దర్శకులు రాసుకున్న కథలు కూడా మంచి విజయాలను సాధిస్తున్నాయి. ప్రస్తుతం తెలుగు సినిమా ఇండస్ట్రీ అంటే పాన్ ఇండియాలో మంచి గుర్తింపు అయితే ఉంది. మన సినిమాల కోసం ఇతర భాషల ప్రేక్షకులు విపరీతంగా ఎదురుచూస్తున్నారు. ఇక మన హీరోల నుంచి వచ్చే సినిమాలు మంచి సక్సెస్ లను సాధిస్తే మాత్రం మన వాళ్లకు ఫ్యూచర్ లో ఇంకా మంచి గుర్తింపు ఉంటుంది. ఇక ఇదిలా ఉంటే జూనియర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో వస్తున్న దేవర సినిమా మీద ప్రస్తుతం ప్రతి ప్రేక్షకుడికి విపరీతమైన అంచానాలైతే ఉన్నాయి. ఇక ఈ సినిమా పాన్ ఇండియాలో రిలీజ్ అవ్వడానికి మరికొన్ని గంటల సమయం పడుతుందన్న నేపథ్యంలో ఇప్పటికే ఈ సినిమాకి సంబంధించిన ప్రీమియర్ షో లను ఈరోజే యూఎస్ఏ లో ప్రదర్శించారు. మరి అక్కడ ఈ సినిమాను చూసిన ప్రేక్షకులు ఈ సినిమా గురించి ఏం చెప్తున్నారు. అనేది మనం ఒకసారి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం..కథ ఇక ముందుగా ఈ సినిమా కథ విషయానికి వస్తే వైజాగ్ లో సముద్రం మీద ఆధారపడి బతుకుతున్న కొన్ని కుటుంబాలను అల్లకల్లోలం చేయడానికి ఒక వ్యక్తి పూనుకుంటాడు. అలాగే ఈ వ్యక్తి కూడా ఆ కుటుంబాలలో నుంచి వచ్చిన వాడే కావడం విశేషం..అయితే అతనికి వ్యతిరేకంగా దేవర ప్రజలకు అండగా నిలబడతాడు. మరి ఆ





దేవర ని ఎవరు చంపారు తన కొడుకు వచ్చి వాళ్ళ మీద రివెంజ్ ఎలా తీర్చుకున్నాడనే ఒక పాయింట్ తో ఈ సినిమాని తెరకెక్కించారు. ఇక దేవరను చంపింది ఎవరు.? ఎందుకు చంపారు అనేది తెలియాలంటే మాత్రం ఈ సినిమా చూడాల్సిందే.విశ్లేషణ ఇక విశ్లేషణ విషయానికి వస్తే దర్శకుడు కొరటాల శివ కథని రోటీన్ ఫార్ములాలో రాసుకున్నప్పటికీ సినిమా స్క్రీన్ ప్లే విషయంలో మాత్రం సరికొత్త విధానాన్ని అనుసరించినట్టుగా యూఎస్ఏ లో ఈ సినిమాను చూసిన వాళ్ళు చెబుతున్నారు. నిజానికి కొరటాల శివ లాంటి దర్శకుడు సారి కొత్త మేకింగ్ విధానాన్ని అలవర్చుకొని చేసిన సినిమాగా కూడా ఈ సినిమాను చూసిన ప్రేక్షకులు చెబుతుండటం విశేషం.జూనియర్ ఎన్టీఆర్ నటన ఈ సినిమాకి చాలా అద్భుతంగా నిలిచింది. ఇక ఈ మ్యూజిక్ కొంతవరకు బాగున్నప్పటికీ బ్యాగ్రౌండ్ మ్యూజిక్ లో మాత్రం అనిరుధ్ పెద్దగా ప్రభావాన్ని చూపించలేదని కూడా వాళ్ళు తెలియజేస్తుండటం విశేషం.ఇక మొత్తానికైతే దేవర సినిమా సక్సెస్ ని సాధించే దిశగా ముందుకు దూసుకు వెళుతుందని కూడా ఈ సినిమాను చూసిన యూఎస్ఏ ప్రేక్షకులు తెలియజేయడం విశేషం.మరి ఇలాంటి క్రమంలోనే జూనియర్ ఎన్టీఆర్ తనదైన రీతిలో ఈ సినిమాని చేసి అక్కడి ప్రేక్షకులను మెప్పించినట్టుగా కూడా తెలుస్తుంది..ఆర్టిస్టుల పర్ఫామెన్స్ జూనియర్ ఎన్టీయార్ ఈ సినిమాలో నటించిన నటన నెక్స్ట్ లెవల్ అనే చెప్పాలి. అలాగే ఈ సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైన జాన్వీ కపూర్ కూడా తన నటనలో పరిణితిని చూపించింది. ఇక మొత్తానికైతే ఈ సినిమా ఆమెకి ఒక మంచి గుర్తింపును తీసుకురావడమే కాకుండా ఆమెలో ఉన్న నటిని కూడా ఇండస్ట్రీకి పరిచయం చేసినట్టుగా కూడా చెబుతున్నారు. ఇక తన క్యారెక్టర్ కూడా చాలా అద్భుతంగా ఉన్నట్టు కూడా అక్కడి ప్రేక్షకులు చెప్తుండటం విశేషం.మరి మొత్తానికైతే దేవర సినిమా ఓవరాల్ గా ప్రతి ప్రేక్షకుడిని ఆకట్టుకునే విధంగా ఉండబోతుందని ఈ సినిమా చూసిన చాలా మంది యుఎస్ఏ ప్రేక్షకులు చెబుతున్నారు.టెక్నికల్ అంశాలు మ్యూజిక్ విషయం లో అనిరుధ్ కొంత వరకు పర్లేదు అనేలా సాంగ్స్ ఇచ్చాడని చెబుతున్నారు. ఇక భాగ్రౌండ్ మ్యూజిక్ లో పెద్దగా పస లేదనే కామెంట్లు వస్తున్నాయి. ఇక ఏది ఏమైనప్పటికి ఎన్టీయార్ మాత్రం ఈ సినిమాతో పూర్తి స్థాయి లో అలరించడని అక్కడి ప్రేక్షకులు చెబుతున్నారు ఇక ప్రొడక్షన్ వాల్యూస్ అయితే చాలా అద్భుతంగా ఉన్నాయట.

## కంగనా రనౌత్ 'ఎమర్జెన్సీ' విడుదలకు మార్గం సుగమం.

## కొన్ని సీన్స్ కట్

కంగనా రనౌత్ సినిమా 'ఎమర్జెన్సీ' విడుదలపై నిషేధం విధించడంపై బాంబే హైకోర్టులో గురువారం మరోసారి విచారణ జరిగింది. ఎమర్జెన్సీ చిత్రం విడుదలకు మార్గం సుగమం అయింది.ఈ చిత్రాన్ని విడుదల చేయవచ్చని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (CBFC) తెలిపింది. అయితే.. సెన్సార్ బోర్డ్ రివ్యూ కమిటీ సూచనల మేరకు సినిమాలో కొన్ని కట్స్ చేయాల్సి ఉంటుంది. జస్టిస్ బిపి కొలబావాలా, జస్టిస్ ఫిర్దౌస్ పోనివాలాలతో కూడిన ధర్మాసనం ముందు బోర్డు ఈ విషయాన్ని తెలిపింది. ఈ క్రమంలో.. చిత్రం విడుదలపై సోమవారం నాటికి ఈ విషయాన్ని పరిశీలిస్తామని చిత్ర నిర్మాత సంస్థ జీ స్టూడియోస్ చెబుతోంది.జీ స్టూడియోస్ స్వయంగా కోర్టులో పిటిషన్ దాఖలు చేసి సెన్సార్ బోర్డ్ ద్వారా సర్టిఫికేట్ జారీ చేసేలా ఆదేశించాలని డిమాండ్ చేసింది. ఈ సినిమాకు సంబంధించి సిక్కు సమాజాన్ని తప్పుగా చూపించారని ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత వివాదం ముదిరిపోవడంతో సెన్సార్ బోర్డు విడుదలను వాయిదా వేసింది. ఆగస్ట్ 29న ఫిల్మ్ సర్టిఫికేషన్ బోర్డు ముందు తమ దరఖాస్తును సమర్పించామని జీ స్టూడియోస్ కోర్టులో తెలిపింది. అయితే ఇప్పటి వరకు బోర్డు నుంచి సెన్సార్ సర్టిఫికెట్ రాలేదు.జబల్పూర్ సిక్కు సంగత్, ఇతర పార్టీల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని.. ఆ తర్వాత సర్టిఫికేట్ జారీ చేయాలని సెప్టెంబర్ 4న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్‌కు చెప్పామని గతంలో కోర్టు పేర్కొంది. ఆ తర్వాత ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మరోవైపు.. కోర్టు సెప్టెంబర్ 25 లోగా నిర్ణయం తీసుకోవాలని బోర్డుని కోరింది, అయితే అప్పుడు కూడా వాయిదా పడుతూ వచ్చింది. ఇప్పుడు విడుదలకు సంబంధించి.. సూచించిన కట్స్ తర్వాత, సినిమాను థియేటర్లలో విడుదల చేయవచ్చని బోర్డు కోర్టులో తెలిపింది. ఈ చిత్రంలో కంగనా రనౌత్ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాత్రను పోషించింది. ఈ చిత్రానికి ప్రధాన అంశం 1975లో ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ.




## ప్రకాష్ రాజ్ ని ఉతికి ఇస్త్రీ చేసిన మాధవిలత



తిరుపతి లడ్డు కల్తీ జరిగిందనే విషయంలో సరదాగా మాట్లాడి నందుకు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్కి ప్రముఖ తమిళ హీరో కార్తీ సారీ చెప్పాడనే విషయం అందరకి తెలిసిందే.ఈ నేపథ్యంలో చెయ్యని తప్పుకు సారీ చెప్పించు కోవడంలో ఉన్న ఆనందమేంటో, జస్ట్ ఆస్కింగ్ అంటు ప్రకాష్ రాజ్ ట్వీట్ చెయ్యడం జరిగాయి.ఇప్పుడు ఈ విషయం మీద ప్రకాష్ రాజ్కి చురకలంటిస్తూ ప్రముఖ హీరోయిన్ మాధవిలత ఒక వీడియో రిలీజ్ చేసింది. అందులో ఆమె మాట్లాడుతూ వేరే మతానికి చెందిన వాళ్ళని ఒక్క మాట అంటేనే నానా హంగామా చేస్తారు. మొన్న బెంగుళూర్ లో ఆంజనేయస్వామి పాటలని వింటున్న వాళ్ళ దగ్గరకి వేరే మతం వాళ్ళు కొంత మంది వచ్చి పాటలు ఆపమని కొడితే ప్రకాష్ రాజ్ ఏం మాట్లాడడు. తిరుపతి లడ్డు విషయంలో తను చేసిన పొరపాటుని కార్తీ గ్రహించి సారీ చెప్పాడు.అలా చెప్పించుకోవడంలో ఎవరకి ఆనందం రాదు.పైగా మన ధర్మం మీద మనమే కామెంట్స్ చేసుకుంటే ఇంకెవరో కామెంట్స్ చేస్తారనే ఉద్దేశంతోనే సారీ చెప్పాడు.వేరే వాళ్ళ మనోభావాల విషయంలో ప్రకాష్ రాజ్ సైలెంట్ గా ఉంటాడు. అదే మా మనోభావాల దగ్గరకొచ్చే సరికి ప్రతిదీ పాయింట్ అవుట్ చేస్తుంటాడు. కాకపోతే ఆయన్ని సపోర్ట్ చేసే ద్రోహులు కూడా ఉంటారని చెప్పుకొచ్చింది.

## నేహా శెట్టి లేటెస్ట్ స్టిల్స్ అదుర్స్.. వైరల్ అవుతున్న ఫొటోస్

నేహా శెట్టి తన కాదనలేని గ్లామర్ మరియు ఆకర్షణతో తన యవ్వన ప్రేక్షకులను అప్రయత్నంగా ఆకర్షించింది.మెహబూబా మరియు మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ వంటి చిత్రాలతో ఆమె తనదైన ముద్ర వేసినప్పటికీ, %ణజీ% టిల్లులో ఆమె పాత్ర యువ ప్రేక్షకులను నిజంగా ప్రతిధ్వనించింది.రూల్స్ రంజన్‌లోని "సమ్మోహనుడా..." పాటలో ఆమె మంత్రముగ్ధులను చేసే నటన ఆమె స్థాయిని మరింతగా పెంచి, ఆమెను మరింత వెలుగులోకి తెచ్చింది.ఇటీవలి ఫోటోషూట్‌లో నేహా క్రీము-రంగు ప్యాంటుతో జత చేసిన స్పోర్ట్స్ బ్రా మరియు సున్నితమైన నెక్లెస్‌తో కూడిన చిక్ ఎన్‌సెంబ్ల్‌ను కలిగి ఉంది.ఆమె స్త్రీత్వం మరియు సాహసోపేతమైన ఫ్యాషన్ సెన్స్ రెండింటినీ హైలైట్ చేస్తూ బోల్డ్‌నెస్‌ని అధునాతనతతో సజావుగా మిళితం చేసింది.ఆమె అయస్కాంత ఆకర్షణను ప్రదర్శించే చిత్రాలు త్వరగా వైరల్‌గా మారాయి, ఆమెకు ఇప్పటికే పెరుగుతున్న అభిమానుల సంఖ్య పెరిగింది.ఇటీవలే గ్యాంగ్స్ ఆఫ్ గోదావరిలో నటించిన నేహా ఫాలోవర్లు ఆమె రాబోయే ప్రాజెక్ట్‌ల గురించి చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## భారత్-పాకిస్థాన్‌కు ఉన్న తేడా అదే!- షకిబ్ అల్ హసన్




భారత్-బంగ్లాదేశ్ మధ్య రెండో టెస్టుకు రంగం సిద్ధమైంది. కాన్పూర్ వేదికగా రేపటి నుంచి చివరి టెస్టు ప్రారంభం కానుంది. చెపాక్ వేదికగా జరిగిన తొలి టెస్టులో భారత్ 280 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. పాకిస్థాన్‌ను వాళ్ల సొంతగడ్డపై ఓడించి 2-0తో టెస్టు సిరీస్ క్లీన్ స్వీప్ చేసిన బంగ్లాదేశ్ అదే జోరును భారత్ గడ్డపై చూపించలేదు.భారత బౌలర్ల ధాటికి బంగ్లా బ్యాటర్లు నిలవలేకపోయారు. ఇక భారత బ్యాటర్లు సాధికారిక బ్యాటింగ్‌కు బంగ్లాదేశ్ బౌలర్లు నిస్సహాయులుగా మారిపోయారు. అయితే టెస్టుల్లో భారత్-పాకిస్థాన్ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని బంగ్లాదేశ్ స్టార్ ఆల్‌రౌండర్ షకిబ్ అల్ హసన్ వివరించాడు. గురువారం మీడియా సమావేశంలో పాల్గొన్న షకిబ్ తన రిటైర్మెంట్ గురించి కూడా మాట్లాడాడు.టీ20 ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తున్నట్లు తెలిపాడు. వచ్చే ఏడాది జరగనున్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీతో వన్డే ఫార్మాట్‌కు గుడ్‌బై పలుకుతానని పేర్కొన్నాడు. ఇక మీర్‌పూర్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగే చివరి టెస్టు సుదీర్ఘ ఫార్మాట్‌లో తన ఆఖరి మ్యాచ్ అని షకిబ్ చెప్పాడు. అయితే భద్రతాపరమైన కారణాలతో ఆ మ్యాచ్ జరగకపోతే రేపు జరిగే కాన్పూర్ మ్యాచే తన ఆఖరి టెస్టు అని అన్నాడు.భారత్, పాకిస్తాన్ గురించి మాట్లాడుతూ.. "బంగ్లాదేశ్‌కు టీమిండియా వచ్చినప్పుడు మేం వన్డే సిరీస్ గెలిచాం. ఇక టెస్టు మ్యాచ్‌ను దాదాపు గెలిచేంతగా పోరాడాం. చెపాక్ వేదికగా జరిగిన తొలి టెస్టులో మా స్థాయికి తగ్గట్లు ఆడలేకపోయాం. ఇక భారత్ పర్యటన అంటే అత్యంత కఠినమైనది. సొంతగొడ్డపై వాళ్లు ఓడిపోవడాన్ని మనం ఇటీవల చూడలేదు. భారత్ లేదా ఇతర పెద్ద జట్లతో మ్యాచ్ అంటే గొప్పగా రాణిస్తేనే సత్తాచాటగలం" "టెస్టు క్రికెట్‌లో ప్రస్తుత పాకిస్థాన్‌కు అనుభవం లేదు. అదే భారత్ గురించి మాట్లాడాలంటే ఇది పెద్ద విషయం. టీమిండియా నంబర్ వన్ జట్టు. గతకొన్నేళ్లుగా సొంతగడ్డపై పరాజయం ఎరుగని జట్టు. భారత్‌కు ఏ టీమ్ వచ్చినా అది ఇబ్బంది పడాల్సిందే" అని షకిబ్ అల్ హసన్ పేర్కొన్నాడు.

## పంత్ మా జట్టులో ఉంటేనా ? ఆస్ట్రేలియా కెప్టెన్ సంచలన వ్యాఖ్యలు



క్రికెట్ ప్రపంచంలో ఇప్పుడు ఎక్కడ చూసినా... రిషబ్ పంత్ పేరే మార్మోగిపోతోంది.పంత్ను సూపర్ మ్యాన్తో ఒకరు పోలిస్తే... మరొకరు మిరాకిల్ మ్యాన్ అంటూ ఆకాశానికి ఎత్తేస్తున్నారు. దాదాపు రెండేళ్ల తర్వాత టెస్టుల్లోకి ఎంట్రీ ఇచ్చిన పంత్.. ఆరంభ మ్యాచ్ లోనే అద్భుత శతకంతో.. టీమిండియా కు ఘన విజయాన్ని అందించాడు. పంత్ సహా అశ్విన్, గిల్ విధ్వంసం... బౌలర్ల రాణింపుతో బంగ్లాను మట్టికరిపించిన టీమిండియా.. రెండు టెస్టుల సిరీస్లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఇక కాన్పూర్ వేదికగా జరిగే రెండో టెస్టులోను భారత జట్టు పంజా విసిరితే సిరీస్ క్లీన్ స్వీప్ అవుతుంది. ఇక భారత్ తర్వాత ఆస్ట్రేలియా తో కఠిన పోరుకు సిద్ధం కానుంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ నవంబర్ 22 నుంచి ఆరంభం కానుంది. ఈ సమయంలో ఆస్ట్రేలియా కెప్టెన్ పంత్ గురించి సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో సంచలనంగా మారాయి.ఆసీస్ కెప్టెన్ ఏమన్నాడంటే..? నవంబర్ 22న ఆరంభం కానున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత్, ఆస్ట్రేలియా మధ్య 5 టెస్టు మ్యాచ్లు జరగనున్నాయి. ఈ సిరీస్కు ముందు ఆస్ట్రేలియా పరిమిత ఓవర్ల కెప్టెన్ మిచెల్ మార్ష్, ట్రావిస్ హెడ్ ఈ సిరీస్పై స్పందించారు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ అధికారిక ప్రసార సంస్థ స్టార్ స్పోర్ట్స్తో ఇద్దరు ఆటగాళ్లు మాట్లాడారు. ఆస్ట్రేలియా జట్టులో కరెక్టా సరిపోయే ఆటగాడిని ఇద్దరు ఆటగాళ్లు ఎంపిక చేశారు. భారత వికెట్ కీపర్ బ్యాట్స్మెన్ రిషబ్ పంత్... ఆస్ట్రేలియా జట్టులో సరిగ్గా సరిపోతాడని... మిచెల్ మార్ష్, ట్రావిస్ హెడ్ అభిప్రాయపడ్డారు. " రిషబ్ పంత్ ఎలాంటి క్రికెటర్ అంటే.. అతను ఆస్ట్రేలియన్ డ్రెస్సింగ్ రూమ్లో బాగా సరిపోతాడు." అని ఈ స్టార్ క్రికెటర్లు అభిప్రాయపడ్డారు. పంత్పై ప్రశంసల జల్లు మిచెల్ మార్ష్ రిషబ్ పంత్పై ప్రశంసలు కురిపించాడు. రిషబ్ పంత్ అద్భుతమైన వ్యక్తి అని, అతను ఆస్ట్రేలియన్ క్రికెట్ జట్టులో ఉంటే బాగుంటుందని అభిప్రాయపడ్డాడు. కొన్నేళ్లుగా పంత్ ఆటను చూసిన తర్వాత.. పంత్ పునరాగమనాన్ని ఘనంగా చాటిన వేళ ఈ నిర్ణయానికి వచ్చినట్లు చెప్పాడు. పంత్ వయసు పరంగా చిన్నవాడని.. కానీ అతను ఎప్పుడూ గెలవడానికి మాత్రమే ఇష్టపడతాడని తెలిపాడు. రిషబ్ పంత్ ఎప్పుడూ ఒత్తిడి లేకుండా ఉంటాడని, ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ ఉంటాడని కూడా ప్రశంసించాడు. తాను పంత్ను ఆస్ట్రేలియన్ క్రికెటర్గానే భావిస్తానని ట్రావిస్ హెడ్ అన్నాడు. తన దూకుడు స్వభావం, వ్యూహంతో ఆడే విధానం బాగుంటుందని పొగడ్తల్లో ముంచెత్తాడు. ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ జోష్ హేజిల్వుడ్... రోహిత్ శర్మపై ప్రశంసలు కురిపించాడు. రోహిత్ శర్మ బ్యాటింగ్ స్టైల్ చాలా ప్రత్యేకమైనదన్నాడు. అతనికి బౌలింగ్ చేయడం చాలా కష్టమని... అయితే, ఆస్ట్రేలియాలో భారత కెప్టెన్ రోహిత్ శర్మకు నాథన్ లియాన్ సవాలు విసరగలడని భావిస్తున్నట్లు చెప్పాడు.

## న్యూజిలాండ్‌తో రెండో టెస్ట్.. రెండేళ్ల కరువును తీర్చుకున్న చండీమల్



శ్రీలంక వెటరన్ బ్యాటర్ దినేశ్ చండీమల్ టెస్ట్ క్రికెట్‌లో రెండేళ్ల సెంచరీ కరువును తీర్చుకున్నాడు. గాలే వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో చండీమల్ ఎట్టకేలకు సెంచరీ మార్కు తాకాడు.చండీమల్ 2022, మేలో చివరిసారిగా (బంగ్లాదేశ్‌పై) టెస్ట్‌ల్లో మూడంకెల స్కోర్ చేశాడు.చండీమల్‌కు ఈ సెంచరీ చాలా ప్రత్యేకం. చండీమల్ సెంచరీ చేసిన తొమ్మిదో దేశం న్యూజిలాండ్. చండీమల్ తన కెరీర్‌లో ఇప్పటివరకు తొమ్మిది వేర్వేరు దేశాలపై (బంగ్లాదేశ్‌పై 5, భారత్‌పై 2, ఆస్ట్రేలియాపై 2, వెస్టిండీస్‌పై 2, ఇంగ్లండ్‌పై 1, ఆఫ్ఘనిస్తాన్‌పై 1, ఐర్లాండ్‌పై 1, పాకిస్తాన్‌పై 1, న్యూజిలాండ్‌పై 1) 16 సెంచరీలు చేశాడు.కాగా, న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో శ్రీలంక టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి రోజు టీ విరామం సమయానికి ఆ జట్టు రెండు వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది. పథుమ్ నిస్సంక (1), దిముత్ కరుణరత్నే (46) ఔట్ కాగా.. చండీమల్ (106), ఏంజెలో మాథ్యూస్ (35) క్రీజ్‌లో ఉన్నారు. నిస్సంక వికెట్ సౌథీకి దక్కగా.. కరుణరత్నే రనౌటయ్యాడు.ఇదిలా ఉంటే, రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం న్యూజిలాండ్ జట్టు శ్రీలంకలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో శ్రీలంక 63 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను మట్టికరిపించింది. ఈ మ్యాచ్‌లో కమిందు మెండిస్ సెంచరీతో.. ప్రభాత్ జయసూర్య తొమ్మిది వికెట్లు తీసి లంక గెలుపులో ప్రధానపాత్ర పోషించారు.మెరుపు అర్ధ సెంచరీలతో విరుచుకుపడిన హోప్, హెట్‌మైర్




తెలంగాణ శాసనసభ
తెలుగు దినపత్రిక

# జిల్లా అనుబంధం

|| శుక్రవారం 27 సెప్టెంబర్ - 2024 || పేజీలు : 4

## మంత్రులతో ముఖాముఖిలో ఫిర్యాదుల వెల్లువ

హైదరాబాద్ / శాసనసభ న్యూస్ ప్రతినిధి : ప్రజా పాలన లో భాగంగా 'మంత్రులతో ముఖాముఖీ' కార్యక్రమం బుధవారం గాంధీభవన్‌లో అట్టహాసం గా ప్రారంభమయ్యింది. ప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టుకునేందుకు ప్రజలు బారులు తీరా రు. మొదటి రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు దాదాపు నా లుగున్నర గంటలపాటు నిర్విరామంగా ఈ కా ర్యక్రమం కొనసాగింది. మొదటి రోజు ఈ కా ర్యక్రమంలో భాగంగా సిడబ్ల్యూసీ సభ్యులు, వై ద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ న ర్సింహ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీ కరించారు. అయితే, గతంలోనూ తాము ప్రజాభవన్‌లో దరఖాస్తులను ఇచ్చామని ఇప్పటివర కు వాటికి పరిష్కారం దొరకలేదని అందుకే ఇ క్కడకు వచ్చామని ప్రజలు మంత్రితో పేర్కొన్న దం విశేషం. విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, వైద్య సేవలు అవసరం ఉన్నవారు, డ బుల్ బెడ్‌రూం, రేషన్ కార్డులు, రెవెన్యూ సమస్యలు ఇలా అనేక సమస్యలపై ప్రజలు దరఖాస్తులు అందజేశారు. మహిళలు, వికలాంగులు, గర్భిణులు,వృద్ధుల కోసం ప్రత్యేకకౌంటర్‌లు ఏ ర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తులకు స్వీకరించినప్పుడు మంత్రి దామోదర్ రాజనర్సింహా ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వాటిని పరిష్కరించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. వచ్చిన దరఖాస్తులను టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు టిపిసిసి సిబ్బంది కంప్యూటర్ లో శాఖల వారీగా దరఖాస్తులను నమోదు చేశారు.. ఆయా శాఖల వారీగా దరఖాస్తులను టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లేఖలను జత చేసి మంత్రులకు పంపనున్నారు.సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: మంత్రి దామోదర ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో



ప్రజలు పాల్గొనడంపై మంత్రి దామోదర రాజనర్సింహా హర్షం వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో 'మంత్రుల ముఖాముఖీ' కార్యక్రమం ఒక నిరంతర ప్రక్రియ అని, ప్రజలు ప్రశాంతంగా ఉండి సమస్యలు పరిష్కారం చేసుకోవాలని మంత్రి సూచించారు. గాంధీ భవన్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం అద్భుతమైన ఆలోచనగా ఆయన అభివర్ణించారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్, సిఎం రేవంత్ రెడ్డికి వచ్చిన గొప్ప ఆలోచన అని ఆయన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వారంలో రెండు రోజులు మంత్రులు గాంధీ భవన్‌కు వచ్చి అర్జీలను స్వీకరించడంతో పాటు వాటి పరిష్కారానికి కృషి చేస్తారని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని వారి ఆశలు అడియాసలు కాకుండా చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. పార్టీకి ప్రభుత్వానికి ఈ కార్యక్రమం ద్వారా మంచి జరుగుతుందని ఆయన తెలిపారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలు అనే తేడా లేకుండా అందరి అర్జీలు తీసుకొని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఓవర్ నైట్‌లో సమస్యలు పరిష్కారం అవుతాయని తాము అనుకోవడం లేదన్నారు. ఒక్కొక్కటి చేస్తే అన్ని పరిష్కారం అవుతాయన్నారు. గతంలో సమస్యలు వినేవారే లేరని, కానీ, ఇప్పుడు తాము చాలా సమయం ఇస్తున్నామన్నారు.

## పనిచేయడం ఇష్టం లేకపోతే బదిలీ చేసుకోండి..
### విద్యుత్ ఉద్యోగులతో ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి


హైదరాబాద్ / శాసనసభ న్యూస్ ప్రతినిధి : నారాయణపేట నియోజకవర్గంలోనే అత్యంత దరిద్రమైన శాఖగా విద్యుత్ శాఖ నిలిచిందని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి అన్నారు. పనిచేయడం ఇష్టం లేకపోతే బదిలీ చేసుకోండని అధికారులకు సూచించారు. నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలో గురువారం నాడు మండల స్థాయి అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.గత ప్రభుత్వంలో 24 గంటలు ఉంటున్న కరెంటు ఇప్పుడు ఎందుకు ఉ ండటం లేదని విద్యుత్ ఉద్యోగులను ఎమ్మెల్యే నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో ఉచితంగా



ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంటు స్తంభాలు ఇచ్చారని, ఇప్పుడు ఎందుకు ఇవ్వట్లేదని ప్రశ్నించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అక్రిడిటేషన్ కార్డుల గడువు పెంపు
### మరో 3 నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు

హైదరాబాద్ / శాసనసభ న్యూస్ ప్రతినిధి : రాష్ట్రంలోని జర్నలిస్టులు అక్రిడిటేషన్ కార్డుల గడువును మరో 3 నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు పెంచుతూ ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్టీసీ సంస్థకు సమాచార పౌర సంబంధాల ప్రత్యేక కమిషనర్ హనుమంత రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. కొత్త అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీ నూతన మార్గదర్శకాలను రూపొందించే పనిలో ఉంది. ఈ క్రమంలో అప్పటిదాక జర్నలిస్టులకు ఇబ్బంది కల గకుండా ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డుల గడువును మరో 3 నెలలు పొడిగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



GOVERNMENT OF TELANGANA
INFORMATION AND PUBLIC RELATIONS DEPARTMENT :: HYDERABAD

Letter No. 003491/MR/2024 Date:26.09.2024.

From,
The Sp. Commissioner,
Information & Public Relations Dept.,
A.C. Guards, Hyderabad.

To,
All the District Collectors,
Telangana State.

Sir,

Sub:- I&PR Dept., – Media Relations Section – Extension of the validity period of the existing State and District Journalists accreditation cards from 01.10.2024 for a period of (3)months i.e upto 31.12.2024– Reg.

Ref:- Govt.Memo.No.4959/I&PR/2024-2, dated: 26.09.2024 received from E.O. Spl. Secretary to Government, GA (I&PR) Department.

***

I am to inform that the validity of accreditation cards issued to the working journalists is going to expire on 30.09.2024. The constitution of the Special Committee for reviewing the Telangana Media Accreditation Rules -2016 issued vide G.O. Ms. No. 239 GA (I&PR) dated: 15.07.2016 and framing fresh guidelines for media accreditations is still awaiting from the government. To avoid inconvenience for the working journalists, the validity of accreditation cards is being extended for a period of (3) months i.e. upto 31.12.2024.

Therefore, I request you to extend the validity period of the existing district journalist accreditation cards from 01.10.2024 for a period of (3) months i.e. upto 31.12.2024.

Yours Faithfully
Sd/- M. Hanumantha Rao
Sp. Commissioner

Copy to
The Chairman, Media Academy of Telangana
The Regional Joint Director, Multi Zone-I & Multi Zone-II
All the DPRO's in the State for information and necessary action

//f.b.o//

Joint Director (MR)

## వచ్చే నాలుగేళ్లలో ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టులను పూర్తి చేస్తాం

హైదరాబాద్ / శాసనసభ న్యూస్ ప్రతినిధి : దశాబ్దాలుగా వెనుకబడిన, వలసలకు పేరుగాంచిన ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులన్నింటినీ ఈ శాసనసభ కాలంలోనే పూర్తి చేసి 12 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని నీటి పారుదల శాఖ మంత్రి ఉ త్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఒకరోజు ఉమ్మ డి మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజెక్టుల పరిశీలన, సమీక్షల నిమిత్తం ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆర్థిక, నీటి పారుదల శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు, జిల్లా ప్రతినిధులతో కలిసి పాలమూరు



రంగారెడ్డి ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల, నియోజకవర్గం పరిధిలోని ఉదండాపూర్ రిజర్వాయర్‌ను బుధవారం సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ఉ త్తమ్ మాట్లాడుతూ.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రాజెక్టులను వేగవంతం చేయాలన్నదే ప్రభుత్వ ఏకైక లక్ష్యమని అన్నారు. దీనిని దృష్టిలో ఉ ంచుకుని ఉదండాపూర్ రిజర్వాయర్ కింద ఆర్ అండ్ ఆర్‌కు రూ.45 కోట్ల నిధులను విడుదల చేశామని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో చేపట్టిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్లతో పాటు కోయిల్‌సాగర్ సహా అన్ని ప్రాజెక్టులను 100కి నూరు శాతం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఉదండాపూ-ర్‌తో పాటు, ఇతర రిజర్వాయర్లతో ముంపునకు గురైన వారికి న్యాయపరంగా పునరావాసం అందిస్తామని, వీటన్నింటిపై సమీక్షించేందుకు ఉమ్మడి పాలమూరు జిల్లా పర్యటన చేపట్టినట్లు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ.. ఉదండాపూర్ రిజర్వాయర్ కింద ఆర్ అండ్ ఆర్‌కు రూ.45 కోట్ల నిధులను విడుదల చేసినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశానికి జడ్చర్ల ఎంఎల్‌ఏ అనిరుధ్ రెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలోమంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, నీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇంజనీర్ ఇన్ చీఫ్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**తుర్కయంజాల్, సెప్టెంబర్ 26(శాసన సభ ) :** తుర్కయంజాల్ పురపాలక సంఘం పరిధిలోని కమ్మ గూడ లో గురువారం చాకలి ఐలమ్మ జయంతి ని పురస్కరించుకొని కమ్మ గూడ చాకలి ఐలమ్మ రజక సంఘం ప్రధాన కార్యదర్శి కానుగుల యాదగిరి,బొమ్మ రాజు అంజయ్య ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య హాజరై ఆమె చిత్ర పటానినికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూభూమి కోసం, భుక్తి కొరకు, వెట్టిచాకిరి విముక్తి కొరకు సాగిన పోరాటంలో ఐలమ్మ కీలక పాత్ర పోషించారని అన్నారు. ఐలమ్మ ఆశయాల సాధనకు అందరం కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలోఇందిరమ్మ కాలనీ అధ్యక్షులు హనుమంతు గౌడ్,వేముల శంకర్,నర్రపాండు, పల్లె రాజు, ఇల్లూరి భాస్కర్ హనుమంత్ రెడ్డి, నక్క శేఖర్, ఎండి షాపి,శీను, దూదిమెట్ల వెంకటేష్ యాదవ్ వెంకట్, ప్రవీణ్ కుమార్, కృష్ణ, శ్రీనివాస్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## రమావత్ బిక్యా నాయక్ మృతి బాధాకరం : రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ సెప్టెంబర్ 26 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** డిండి మండలం జాల్ తండాకు చెందిన రమావత్ బిక్యా నాయక్ మృతి బాధాకరం అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.గురువారం జల్ తండాలో భిక్య నాయక్ మృత దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...... బిక్యా నాయక్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.బిక్యా ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.వారి వెంట మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, రమావత్ లక్ష్మీపతి, నాగవరం ప్రభాకర్ రావు, రమావత్ వెంకట్రం, బొడ్డుపల్లి కృష్ణ, దర్శనం విష్ణు, జంగయ్య,తదితరులు ఉన్నారు.

## మాల్ ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని పరిశీలించిన పట్నం డిపో మేనేజర్



**యాచారం, సెప్టెంబర్ 26 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** యాచారం మండలం మాల్ గ్రామపంచాయతీ పరిధిలోని మాల్ మార్కెట్లో గల ఆర్టీసీ బస్టాండుకు సంబంధించిన స్థలాన్ని స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకట నరసప్ప గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ నుండి గ్రామ సభలో తీర్మానం చేసి ఆస్థలాన్ని ఎలాంటి అభ్యంతరం లేకుండా మాకు అప్పచెప్పి ఎమ్మెల్యే నుండి ఒక లెటర్ మాకు ఇప్పించగలిగితే ప్రజల సౌకర్యార్థం త్వరలోనే బస్టాండు కు సంబంధించిన బిల్డింగును,షాపింగ్ మాల్స్ (మడిగెలు) అందుబాటులోకి తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి సభ్యులు లక్ష్మీపతి గౌడ్, నియోజకవర్గం ఓబిసి ప్రధాన కార్యదర్శి పొలమోని రామ లింగం, యువజన కాంగ్రెస్ మాల్ గ్రామ శాఖ అధ్యక్షుడు దొంతర మోని శ్రీకాంత్, ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోకు సంబంధించిన అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు





**చింతపల్లి, సెప్టెంబర్ 26 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** చింతపల్లి మండలంలో రాష్ట్రీయ పోషణ్ మాసం కార్యక్రమంలో భాగంగా గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, కేజీబీవీ పాఠశాలలో 9,10 వ తరగతి, ఇంటర్మీడియట్ లోని కిశోర బాలికలకు ఐసిడిఎస్, హెల్త్ డిపార్ట్మెంట్ హిమోగ్లోబిన్ టెస్టులు గురువారం నాడు నిర్వహించడం జరిగింది. అదేవిధంగా పౌష్టికాహారం ప్రాముఖ్యత, రక్తహీనత వలన కలిగేటువంటి అనర్థాలు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. వీరిలో మొత్తం 98 మంది కి పరీక్షలు నిర్వహించగా వీరిలో నార్మల్ 26 , మైల్డ్ 11, మోడరేట్ 37, సివియర్ 24 ఉన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఇక్బాల్, ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి , కాలేజీ ప్రిన్సిపాల్ ధనరాజ్ , లెక్చరర్స్, స్కూల్ టీచర్స్, శిరేష, యాస్మిన్ , యాదయ్య,అంగన్వాడి టీచర్లు, స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం

### - జోనల్ స్థాయి క్రీడోత్సవాలను ప్రారంభించిన మర్రి నిరంజన్ రెడ్డి





**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 25 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** జోనల్ సెక్రెటరీ సుశీల, గురు కుల విద్యాపీట్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, పిడి, పిఇటి లు మర్రి నిరంజన్ రెడ్డిని సాదరంగా ఆహ్వానించి సన్మానించారు.ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని గురుకుల విద్యాపీట్లో నిర్వహిస్తున్న జోనల్ అండర్ 17 బాలురు, బాలికలు,అండర్ 14 బాలురు, బాలికలు యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల విద్యార్థులకు నిర్వహిస్తున్న కబడ్డీ, కోకో, వాలీబాల్ టోర్నమెంట్ జిల్లా స్థాయి సెలక్షన్ క్రీడలకు సంబంధించి గత పది సంవత్సరాలుగా గెలుపొందిన క్రీడాకారులకు క్రీడాభిమానిగా ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి బహుమతులు ప్రధానం చేస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు శారీర దారుఢ్యానికి మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించాలన్నారు.జోనల్ స్థాయి క్రీడోత్సవాలను ఒక తొలిమెట్టుగా వినియోగించుకొని క్రీడలలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. విద్యార్థులు చదువుతోపాటు ఆట,పాటలలో విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు, తల్లిదండ్రులకు, గ్రామానికి సమాజంలో మంచి పేరు తీసుకురావాలని కోరారు. మీకు అందివచ్చిన ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులలో దాగిన ప్రతిభను వెలికితీయడానికి జోనల్ స్థాయి క్రీడోత్సవాలు ఉపయోగపడతాయన్నారు. తన సొంత నిధుల నుండి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థిని విద్యార్థులకు (క్రీడాకారులకు) త్వరలో స్పోర్ట్స్ కిట్స్ (ఆట వస్తువులను) అందజేస్తానని తెలిపారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా పదవ తరగతి చదువుకునే విద్యార్థిని విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ను అందజేస్తానాని, విద్యార్థులకు నా సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని ఈ సందర్భంగా మర్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఈటీఏ రాష్ట్ర అధ్యక్షులు రాఘవరెడ్డి, పిఈటిఏ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, ఎస్ జి ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చిన్న కేశవరెడ్డి, మరియు యాచారం,మంచాల, ఇబ్రహీంపట్నం జోనల్ సెక్రటరీలు, పిడి, పిఇటి లు, నాయకులు కొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి,విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తితోనే.. కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించారు

### - మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ సెప్టెంబర్ 26 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, మహిళాశక్తికి, బహుజన ధీరత్వానికి ప్రతీక చాకలి ఐలమ్మ అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.గురువారం దేవరకొండ పట్టణంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలలో పాల్గొని ఆమె విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... భూస్వాములపై గర్జించిన - సివంగి - చాకలి ఐలమ్మ అని ఆయన అన్నారు.తెలంగాణ వీరవనిత,ఆధునిక సమాజ స్థాపనకు నాంది పలికిన స్త్రీ ధైర్యశాలి,దేశ్ ముఖ్,రజాకార్ల అరాచకాలపై ఎదురుతిరిగిన ధీశాలి, తెలంగాణ రైతాంగ విప్లవ స్ఫూర్తి ప్రదాత స్వర్గీయ చాకలి ఐలమ్మ అని అన్నారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు చాకలి ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు అని గుర్తు చేశారు.ఆధిపత్య వాదం ఎక్కు పెట్టిన ఆయుధం, అన్యాయాన్ని నిలదీసిన వీరవనిత, వివక్షత పై చైతన్య పోరాడిన యోధురాలు అని ఆయన తెలిపారు.దొరతనము ఎదిరించి వీరత్వం, భూస్వాములపై గర్జించిన సివంగి అని కొనియాడారు.ఆకలికి అతి చేరువైన చాకలి కులంలో పుట్టి చీమల శతక చేతి వృత్తి దారులు అరిగొస పడుతున్న కాలంలో భూస్వాములు పటేళ్లు పట్వారీల కాళ్ల కింద నలిగిపోతున్న వర్గాల కు పోరాట మార్గం చూపిన ఆశాదీపం అని,ప్రతి ఒక్కరు చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్నటువంటి ఆడ పిల్లల మీద అత్యాచారాలను ప్రతిఘటించాలని అన్నారు.ప్రతి ఆడబిడ్డ చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు.చాకలి ఐలమ్మ జీవిత చరిత్ర ను గ్రంథాలయాల్లో పాఠ్యపుస్తకాలు ప్రవేశపెట్టి ప్రచారం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు,నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ,యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు పొట్ట మధు,మండల అధ్యక్షుడు రమావత్ తులిసిరాం,బిఆర్ఎస్ నాయకులు నాగవారం ప్రభాకర్ రావు,ఇలియాస్ పటేల్,బాబా, చంద్రమౌళి,జనిబాబ,అఫ్రోజ్,గండూరి లక్ష్మణ్,SK. జమిర్ బాబా,జూలూరు రమేష్ గౌడ్,నజీర్,లెండల లక్ష్మీకాంత్, మహ్మద్ షదబ్,గుండాల వెంకట్, శ్రీను,తదితరులు ఉన్నారు.

## చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ





**మర్రిగూడ / సెప్టెంబర్ 26 : ( శాసనసభ ) :** హక్కుల సాధన కోసం రజాకార్లు, దొరలను ఎదురించిన గొప్ప ప్రజాస్వామికవాది, వీరవనిత చాకలి ఐలమ్మ అని మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మర్రిగూడ మండల కేంద్రంలో దివంగత వెంకటంపేట ఎల్లయ్య కుమారులు ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని గురువారం ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మ నేటి మహిళలందరికీ స్ఫూర్తిదాయకమన్నారు.చాకలి ఐలమ్మ పోరాట పటిమను యావత్ తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరువలేరన్నారు. ఐలమ్మ పోరాటం ఫలితంగానే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిజాం నిరంకుశ పాలనను దహించివేసిందన్నారు.మనకోసం పోరాటం చేసిన వ్యక్తులను గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ . నల్గొండ డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నమనేని రవీందర్ రావు , మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాందాస్ శ్రీనివాస్, రజక సంఘం రాష్ట్ర నాయకులు పగడాల లింగయ్య, కొలుకుల పల్లి యాదయ్య,మాజీ జెడ్పీటీసీ పాశం సురేందర్ రెడ్డి, మర్రిగూడ మాజీ సర్పంచ్ మాస శేఖర్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శాసనసభ

శుక్రవారం 27 సెప్టెంబర్ - 2024

## యువతతోనే సమాజ మార్పు : ఎమ్మెల్యే బాలు నాయక్




**దేవరకొండ సెప్టెంబర్ 26 శాసనసభ న్యూస్ :** MKR డిగ్రీ కళాశాల లో గురువారం 10వ గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ముఖ్యఅతిధి హాజరు అయ్యారు ఈ సందర్బంగా అయనమాట్లాడుతూ..యువతతోనే సమాజ మార్పు సాధ్యం అన్నారు,కళాశాలకు కావలసిన మౌలిక వసతులు కల్పించడానికి అహర్నిశలు కృషి చేస్తామన్నారు,ప్రభుత్వం యువతను ప్రోత్సహించేందుకు క్రీడల అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటుంది అన్నారు యోగా, ధ్యానంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని,యువత తల్చుకుంటే ఎలాంటి మార్పునైనా తీసుకురాగలరు అన్నారు ఈ కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్,మాజీ ఎంపీపీ జాని యాదవ్, మాజీ ZPTC అరుణ సురేష్ గౌడ్, సినియర్ నాయకులు శిరందస్ కృష్ణయ్య, PACs చైర్మన్ డాక్టర్ వేణుధర్ రెడ్డి, కొర్ర రాంసింగ్ నాయక్,కిన్నెర హరికృష్ణ,కళాశాల బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమించాలి : ఎర్ర కృష్ణ జాంభవ్



**దేవరకొండ సెప్టెంబర్ 26 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, మహిళాశక్తికి, బహుజన ధీరత్వానికి ప్రతీక చాకలి ఐలమ్మ వారి జయంతి సందర్బంగా నివాళి అర్పించారు. ఈ సందర్బంగా DYJAC రాష్ట్ర చైర్మన్ న్యాయవాది ఎర్ర కృష్ణ జాంభవ్ మాట్లాడుతూ..తెలంగాణ వీరవనిత,ఆధునిక సమాజ స్థాపనకు నాంది పలికిన స్త్రీ ధైర్యశాలి,దేశ్ ముఖ్,రజాకార్ల అరాచకాలపై ఎదు-రుతిరిగిన ధీశాలి, తెలంగాణ రైతాంగ విప్లవ స్ఫూర్తి ప్రదాత స్వర్గీయ చాకలి ఐలమ్మ అని ప్రతి ఒక్కరు చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో న్యాయవాది నూనె సురేష్, అందుగుల సైదులు, సెల్వది పెద్దులు, న్యాయవాది కొమ్ము రాజశేఖర్,సిద్దు, రవి, బాలు, అరవింద్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చిట్యాల చాకలి ఐలమ్మ 129 జయంతి




**చండూరు, సెప్టెంబర్ 26 శాసనసభ న్యూస్ :** చండూరు మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలు గురువారం జరిగాయి. మున్సిపల్ చైర్ పర్సన్ తోకల వెంకన్న చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భూస్వాములపై గర్జించిన శివంగి చాకలి ఐలమ్మ అని,తెలంగాణ వీరవనిత ఆధునిక సమాజ స్థాపనకు నాంది పలికి స్త్రీ ధైర్యశాలి, దేశముఖ్, రజాకార్ల అరాచకాలపై ఎదురు తిరిగిన ధీశాలి, తెలంగాణ రైతాంగ విప్లవ స్ఫూర్తి ప్రదాత స్వర్గీయ చిట్యాల చాకలి ఐలమ్మ అని ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తోకల వెంకన్న, కోడి వెంకన్న, గుంటి వెంకటేశం, అన్నెపర్తి శేఖర్, కార్యాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి సేవిస్తూ పట్టుబడ్డ ముగ్గురు యువకులు

### - నిత్యం పర్యవేక్షణలో ఇబ్రహీంపట్నం పోలీసులు.
### - కేసు నమోదుచేసుకొని రిమాండ్ కు తరలింపు



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 26 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** ఇబ్రహీంపట్నం త్రిశక్తి కాలనీలో గంజాయి సేవిస్తూ పోలీసులకు పట్టుబడ్డ ముగ్గురు యువకులు. వివరాల్లోకి వెళితే సిఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం ఇబ్రహీంపట్నం లోనీ త్రిశక్తి నగర్ కాలనీలో బ్రిలియంట్ స్కూల్ వెనకాల “బోళ్ల వంశీధర్, నివాసం త్రీ శక్తి కాలనీ ఇబ్రహీంపట్నం వాళ్ళ పాత రేకుల ఇంటిలో అతని స్నేహితులైనటువంటి చెరుకుపల్లి కృపాకర్ రెడ్డి,24 నివాసము ఖానాపూర్ గ్రామం ఇబ్రహీంపట్నం మండలం. పగడాల నితిన్ సాయి 24 ఇబ్రహీంపట్నం గ్రామం, వీరు ముగ్గురు చిన్నప్పటినుండి ఫ్రెండ్స్. గతకొన్ని రోజులుగా చెడు అలవాట్లకు బానిసై సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో హైదరాబాదులోని దూల్పేట్ లో గంజాయి కొనుక్కొని వచ్చి ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాలలో కాలేజ్ స్టూడెంట్స్ కు సరఫరా చేస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. అలాగే వీరుకూడ గంజాయితాగడం అలవాటు చేసుకున్నారు . 25 తేదీ ఉదయం10:30 నిమిషాల సమయంలో వంశీధర్ ఇంటిలో ముగ్గురు కలిసి గంజాయి తాగుతున్నారన్న పక్కా సమాచారంతో ఇబ్రహీంపట్నం పోలీసులు పట్టుకుని వారి వద్ద ఉన్నటువంటి 100 గ్రాముల గంజాయి, మూడు సెల్ ఫోన్లు, ఒక ఫ్యాషన్ ప్రో ద్విచక్ర వాహనమును స్వాధీనం చేసుకొని ముగ్గురి పై కేసు నమోదుచేసి వారిని రిమాండ్ చేయడం జరిగిందని సీఐ సత్యనారాయణ తెలిపారు.

## పల్లె దవాఖానకు శంకుస్థాపన శంకుస్థాపన చేసిన : ఎమ్మెల్యే బాలు నాయక్



**దేవరకొండ సెప్టెంబర్ 26 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** డిండి మండల పరిధిలోని వావిల్ కోల్ గ్రామంలో NHM నిధుల నుంచి మంజూరు అయినా 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న పల్లె దవాఖానా పనులకు గురువారం ఎమ్మెల్యే బాలునాయక్ శంకుస్థాపన చేశారు హాజరై,ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ..ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పల్లె దవాఖానలను ప్రారంభిస్తోందని అన్నారు,ఈ కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్,మండల బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతినేని వేంకటేశ్వర్లు,మండల పార్టీ అధ్యక్షులు నల్లవెల్లి రాజేష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి,దేవరకొండ మాజీ ZPTC అరుణ సురేష్ గౌడ్, యువజన విభాగ నాయకులు కిన్నెర హరికృష్ణ పంచాయతీ రాజ్ ఏఈ, తదితరులు పాల్గొన్నారు.

## శివమాచి రజక సహకార సంఘంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**చింతపల్లి, సెప్టెంబర్ 26 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** చింతపల్లి మండలం ఘడియ గౌరారం శివమాచి రజక సహకార సంఘం ఆధ్వర్యంలో వీరవనిత చిట్యాల చాకలి ఐలమ్మ 129 వ జయంతి వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ శాసనసభ్యులు ఉజ్జిని యాదగిరి రావు పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి మాజీ గ్రామ సర్పంచ్ ఉజ్జిని విద్యా సాగర్ రావు, వరికుప్పల వెంకట్రాములు, మాజి ఎంపీటీసీ జక్కుల వెంకటయ్య, ఉజ్జిని రఘురామరావు, అదిరాల కృష్ణయ్య, మాజీ ఎంపీటీసీ స్వాతి గిరి, గుణమోని కొండల్ యాదవ్, నరేందర్ రావు, గుణమోని సైదులు, వడ్డేమోని కృష్ణయ్య, గ్రామ ప్రజలు హాజరయ్యారు. అదేవిధంగా గ్రామ-స్తుల సమక్షంలో చాకలి ఐలమ్మ విగ్రహము ఏర్పాటు చేయుటకు నిర్ణయిచడం జరిగింది. అనంతరం శివమాచి రజక సహకార సంఘం సభ్యులు కార్యక్రమానికి హాజరైనటువంటి పెద్దలకు శాలువాలతో సన్మానం చేయడం జరిగింది.

## యాచారంలో ఘనంగా చాకలి అయిలమ్మ జయంతి వేడుకలు

### - ముఖ్య అతిథిగా పాల్గొన్న మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి.



**యాచారం, సెప్టెంబర్ 26 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** యాచారం మండలంలో చాకలి ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి తనయుడు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ దేశ్ ముఖ్, రజాకార్ల అరాచకాలపై ఎదురు తిరిగిన ధీశాలి, తెలంగాణ రైతాంగ విప్లవ స్ఫూర్తి ప్రదాత చాకలి ఐలమ్మ అని ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి యాచారం మండల్ మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, రాచర్ల వెంకటేశ్వర్లు, ఇబ్రహీంపట్నం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, శేరిగూడ సొసైటీ బ్యాంక్ చైర్మన్ ఏద్దుళ్ల పాండురంగారెడ్డి, యాచారం మండల ముఖ్య కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వీరవనిత చిట్యాల చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలు





**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, సెప్టెంబర్ 26 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరవనిత చాకలి ఐలమ్మ అని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత అన్నారు.గురువారం వీరనారి చాకలి ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత ముఖ్య అతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ వీరనారి చాకలి ఐలమ్మ క్రిష్టాపురంగ్రామం, రాయపర్తి మండలం, వరంగల్ జిల్లాలో జన్మించిందని అన్నారు. వీరనారిచాకలి ఐలమ్మ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలని, నిజాం పాలన సమయంలో విస్నూర్ దేశ్ ముఖ్ కి వ్యతిరేకంగా హక్కులకై పోరాటం చేసిందని, దోపిడి,పిడనలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధురాలు అని అన్నారు. ఐలమ్మ ధైర్యం,తెగువ చూపుతూ రాజాకార్ల గుండెల్లో భయం పుట్టించిందని తెలిపారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరవనిత చాకలి ఐలమ్మ అని అన్నారు. ఈ భూమినాది, పండించిన పంటనాది, తీసుకెళ్లడానికి దొరెవ్వడు, నా ప్రాణం పోయాకే ఈ పంట, భూమి మీరు దక్కించుకోగలరు, అంటూ మాటల్ని తూటాలుగా మల్చుకొని దొరల గుండెల్లో బడబాగ్నిలా రగిలిన తెలంగాణ రెట్కతాంగ విప్లవాగ్ని చాకలి ఐలమ్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏ.ఓ.సునీల్, బీసీ వెల్ఫేర్ అధికారి కేశవ్ రామ్, తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రంగారెడ్డి జిల్లా కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సి.మల్లేష్ పెండ్యాల, ఉమేష్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు,బి.నరసింహ, అల్మాస్గూడ అధ్యక్షులు జి నాగేష్, అల్మాస్గూడ ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజ్, అల్మాస్గూడ ఉపాధ్యక్షులు ఎస్ శ్రీనివాస్,దిల్సుఖ్నగర్ కమిటీ అధ్యక్షుడు నవీన్ కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శాసనసభ
శుక్రవారం 27 సెప్టెంబర్ - 2024

# మంచి నీటి సరఫరా పైపు లైన్ ను ప్రారంభించిన దేవరకొండ ఎమ్మెల్యే



**కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 26 శాసనసభ న్యూస్ :** కొండమల్లేపల్లి మండలంలోని చెన్నారం గ్రామంలో నూతనంగా నిర్మించిన మంచి నీటి సరఫరా పైపు లైన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి గురువారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# సి.సి రోడ్డు పనులను పరిశీలించిన ఐలయ్య.



**తుర్కయంజాల్, సెప్టెంబర్ 26 ( శాసనసభ) :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి 22వ వార్డు కమ్మగూడ ఇందిరమ్మకాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కొశికే ఐలయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి కొందరు అడ్డంకులు సృష్టించినా... ఎమ్మెల్యే సహకారంతో పూర్తిచేశామని తెలిపారు. కాంట్రాక్టర్లు సిసి రోడ్డు పనులను నాణ్యత ప్రమాణాలతో పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఈ రోడ్డు ఏర్పాటుతో మూడు కాలనీలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని సంతోషం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఈ రోడ్డు పూర్తికావడం సంతోషంగా ఉందన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ అనురాధ రాంరెడ్డి సహకారంతో పనులు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హనుమంత్ గౌడ్, సాయిరెడ్డి, గౌని రాము గౌడ్, రాజు నాయక్, వెంకటేష్, రాజు, పాండు తదితరులు

# చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకం



**దేవరకొండ సెప్టెంబర్ 26 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** చాకలి ఐలమ్మ జయంతిని NSS 1 & 3 ఆధ్వర్యంలో గురువారం పట్టణం లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా ఇంటర్ విద్యాధికారి ఆర్. దస్రు నాయక్ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ జీవితం యువతకు స్ఫూర్తిదాయకం అన్నారు,కార్యక్రమం లో ప్రిన్సిపాల్ జి. మల్లయ్య, చింతపల్లి ప్రిన్సిపాల్ ధనరాజ్, NSS ప్రోగ్రాం ఆఫీసర్లు ,S. జయప్రకాష్ నారాయణ V.నరసింహ,అధ్యాపకులు సాయిలు,వెంకటేశ్వర్లు, పార్థసారథి , రాజు , శ్రీను ,శ్రీదేవి , అమీనా పర్వీన్ , నవత , సిబ్బంది,NSS వాలంటీర్లు, తదితరులు ఉన్నారు

# క్రీడల అభివృద్ధి కోసం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

## - దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్.



**చింతపల్లి, సెప్టెంబర్ 29 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యతో పాటు క్రీడల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం చింతపల్లి మండల పరిధిలోని కుర్మేడ్ జెడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాల లో 68వ డివిజన్ స్థాయి ఎస్ జి ఎఫ్ క్రీడలు గురువారంతో ముగిసాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ హాజరై విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడారు. నేటి సమాజంలోని విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించినప్పుడే మనకు సమాజంలో విలువలు పెంపొందుతాయన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఓటమి కూడా సానుకూల దృక్పథంతో స్వీకరించాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో ప్రతిభ కనబరిచిన యువకులే నేడు ప్రపంచాన్ని శాసిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి మండలానికి ఒక క్రీడా స్థలాన్ని ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. క్రీడల అభివృద్ధి కోసం దేవరకొండ



నియోజకవర్గం లోని ప్రతి మండలంలో క్రీడల కోసం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసేందుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చా రు. అంతరం క్రీడల్లో గెలుపొందిన విజేతలకు, ప్రథమ, ద్వితీయ, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నీరుడు అంజయ్య, ఉపాధ్యాయ సిబ్బంది, పలు గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కొండాపురంలో రుణమాఫీ

## చేయాలంటూ రైతుల ధర్నా



**చండూరు, సెప్టెంబర్ 26 శాసనసభ న్యూస్ :** రైతుల రుణమాఫీ విషయంలో ప్రభుత్వం తాత్సారం చేస్తున్నారని, పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని మాఫీ అయిన రైతులకు కొత్త రుణాలు ఇవ్వడం లేదని గురువారం చండూరు మండలం కొండాపురం గ్రామలో కొమ్ము గణేష్ ఆధ్వర్యంలో రైతన్నలు రోడ్డుపై బైటాయించి, ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 2 లక్షల రుణమాఫీ హామీ పూర్తిస్థాయి లో అములు చేయలేదని, ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఇప్పుడు రుణమాఫీ చేయని ప్రభుత్వం గద్దె దిగాలని రైతులు ఆరోపించారు. ఎలాంటి షరతులు లేకుండా పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో కొండాపురం గ్రామ రైతులు, ఇరిగి రామలింగయ్య ,గుణగంటి లింగయ్య,ఇరిగి ఎల్లయ్య,నరసింహ్మా, ఒర్సు ఇదయ్య, ఇరిగి అంజమ్మ, మాధగోని ఎల్లమ్మ, సిలివేరు జయమ్మ, ప్రజలు,మహిళలు , తదితరులు పాల్గొన్నారు

# దుర్గంధం వెదజల్లుతున్న కోళ్ల ఫారం



- ముక్కుపుటలు అదిరేలా కోళ్ల పెంట దుర్వాసన
- వ్యవసాయ రైతులకు నిత్యం ఇబ్బందికరమే
- కోళ్ల ఫారం వైపు కన్నెత్తి చూడని సంబంధిత అధికారులు.
- పి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు

**చింతపల్లి, సెప్టెంబర్ 26 శాసనసభ న్యూస్ ప్రతినిధి** రంగారెడ్డి, నల్లగొండ జిల్లా సరిహద్దు ప్రాంతమైన నాగార్జునసాగర్ – హైదరాబాద్ రాష్ట్ర ప్రధాన రహదారి సమీపంలో రంగారెడ్డి జిల్లా మాడుగుల మండలం కొలుకులపల్లి గ్రామ సమీపంలో కోళ్ల ఫారం ఏర్పాటు చేశారు. ఈ రహదారి పై నిత్యం వేలాది మంది వాహన చోదకులు, బాటసారరులు ప్రయాణం చేస్తుంటారు. కోళ్ల ఫారాన్ని ఏర్పాటు చేసిన యాజమాన్యం కోడి ఎరువును రోడ్డు పక్కన పోసి దానిలో కెమికల్స్ కలిపి పెద్ద డంపింగ్ యార్డ్ గా మార్చడం వల్ల చింతపల్లి మండలం మదనాపురం, చాకలిసేరిపల్లి, తక్కల్లపల్లి, బోటిమీది తండ, పాలెం తండ, కురుమేడు గ్రామాల ప్రజలతో పాటు నిత్యం నాగార్జునసాగర్ హైదరాబాద్ ప్రధాన రహదారిపై వెళ్లే ప్రయాణికులు ఈ కోడి ఎరువు నుంచి వచ్చే భయంకరమైన దుర్వాసన వల్ల ముక్కుపుటాలు అదిరేలా అనేక రోగాలకు గురై ఇబ్బందుల పాలవుతున్నారు. ఈ ప్రాంతం నుంచి రోజువారిగా నల్గొండ, మిర్యాలగూడ నాగార్జునసాగర్ నుండి హైదరాబాద్ కు ఎంతోమంది అధికారులు వెళుతున్నా కనీసం ఏఒక్కరు పట్టించుకోకపోవడం బాధాకరం. గ్రామ శివారులో ఏర్పాటుచేసిన కోళ్ల ఫారం ద్వారా దుర్వాసన వెదజల్లుతుంది. కోళ్ల ఫామ్ యజమానుల నిర్వాకం వల్ల కోళ్ల ఎరువు తీసుకొచ్చి రహదారి సమీపంలో ఇష్టారాజ్యాంగ డంపింగ్ చేస్తున్నారు. ద్విచక్ర వాహన దారులు పాదాచారులు రహదారిపై వెళ్తున్న క్రమంలో దుర్వాసన విపరీతంగా రావడంతో, చుట్టుపక్కల వ్యవసాయం చేస్తున్న రైతుల పరిస్థితి ఆగమ్య గోచరంగా తయారైంది. వ్యర్థాలపై ఈగలు, దోమలు, కీటకాలు, కొంగలు వాలి వాతావరణం కలుషితం చేయడం వల్ల రోగాల బారిన పడి తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారు. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోందని నల్లగొండజిల్లా, రంగారెడ్డి జిల్లా ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. లేనిపక్షంలో స్థానిక ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ప్రజా ఆందోళన కార్యక్రమం నిర్వహించాల్సి వస్తుందని పి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు అన్నారు.

శాసనసభ
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

కేంద్ర ప్రభుత్వంచే గుర్తించబడిన తెలంగాణ శాసనసభ
తెలుగు దిన పత్రికలో ఈ ప్రాంతాల్లో వార్తలు
సేకరించడానికి విలేకరులు కావలెను.
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు

నల్గొండ జిల్లాలో ఖాళీగా ఉన్న డేట్ లైన్లు

నల్గొండ జిల్లా: చందంపేట, డిండి, పి.ఏ.పల్లి, నాంపల్లి, మర్రిగూడ, గుర్రంపోడు, చండూర్, మునుగోడు, హాలియా, పెదవూర, నిడుమనూరు నల్గొండ, కనగల్, మిర్యాలగూడ, త్రిపురారం, కట్టంగూర్, తిప్పర్తి, నకిరేకల్ తదితర ప్రాంతలలో పనిచేయుటకు ఆసక్తిగల వారు క్రింది ఫోన్ నంబర్లకు సంప్రదించండి.

తెలంగాణ శాసనసభ దినపత్రిక నెట్‌వర్క్ ఇంచార్జ్ వెంకటేశ్
సెల్: 9949360937,9100900931